హైదరాబాద్ వార్త

రికార్డులకు దూరంగా...

-పత్రాలు లేని పసిడి దందా..
-తెల్ల కాగితాలపైనే లావాదేవీలు
-నగరంలో గుట్టుగా సాగుతున్న జీరో వ్యాపారం
-చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న వాణిజ్య పన్నులశాఖ

హైదరాబాద్,ఫిబ్రవరి 28 ,ప్రభాతవార్త:

ఓవైపు బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండగా..మరోవైపు జీరోవ్యాపారానికి తెరతీశారు పలువురు బంగారం వ్యాపారులు. ఇటీవల గోల్డ్ రేటు భారీగా పెరగడంతో గతంలో తమ వద్ద నిల్వఉంచిన బంగారాన్ని మార్కెట్ ధరకంటే 2నుంచి 3వేలు తగ్గిస్తున్నట్లుగా చూపిస్తూ డబ్బులు తెస్తేనే బంగారం తగ్గించిఇస్తాం అని తిరకాసు పెడుతున్నారు. చెక్కులు, ఆన్‌లైన్ పేమెంట్‌లను ఒప్పుకోవడం లేదు. దీంతో తమకు రేటుతగ్గుతుందని వినియోగదారులు బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అలాగే వ్యాపారులు సైతం అమ్మిన బంగారానికి నగదు రసీదు ఇవ్వకుండా కేవలం తెల్లకాగితంపై వేసి ఇస్తున్నారు. ఇలా నగర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగరంలోని ఎల్బీనగర్, దిల్‌షుఖ్‌నగర్, జనరల్ బజార్, ఓల్డ్‌సిటీ ప్రాంతాల్లో ఎలాంటి పన్నులు చెల్లించకుండానే బంగారం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

తెల్లకాగితాలపైనే..

వాస్తవానికి బూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నుండి హాల్‌మార్క్ లైసెన్స్‌లు ఉన్న వ్యాపారులు మాత్రమే బంగారం విక్రయాలు జరుపాలి. కానీ ఎలాంటి అనుమతి లేకుండానే ఆభరణాల తయారీ పేరుతో యథేచ్ఛగా కాలనీల్లో దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తున్నారు. దీనికితోడు వ్యాపారుల హస్త మాయాజాలంతో వినియోగదరుడు నిండా మునుగుతున్నాడు. బంగారం జీరో దందాలు జోరుగా నడుస్తున్నా ఏదైనా ఉదతం జరిగినప్పుడే ఈదందాల పై అధికారుల లెక్కల్లోనికి వస్తున్నాయి. తెరపైకి రాకుండా చాపకింది నీరులా సాగిపోతున్న జీరో నెంబర్ బంగారం వ్యాపారానికి నగరంలో కొదవలేదని ఐటీ అనుమానిస్తోంది. రాజధానిలో జరుగుతున్న బంగారం విక్రయాల్లో దాదాపు40 శాతం రికార్డులకు దూరంగా ఉంటుందని తెలుస్తోంది. ప్రతి నెలా దాదాపు రూ.500కోట్ల వరకు ఈతరహా వ్యాపారం సాగుతోందని సమాచారం.. అయినా లక్షల రూపాయల్లోనే జరుగుతుందంటూ చాలా మంది పన్నులు చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. బంగారం వ్యాపావరంలో ఒక్కబిల్లు కట్‌చేస్తే ట్యాక్స్‌ల రూపంలో భారీ మొత్తమే చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో అటు రిటైల్ ఇటు హోల్‌సెల్ వ్యాపారాలు కాగితాల్లోనే సాగిపోతున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న నాణ్యత..

నగరంలోని చాలచోట్ల బంగారం దుకాణాల్లో ఎక్కువగా రెడీమెడ్ బంగారం వస్తువులు విక్రయిస్తుండటంతో హాల్‌మార్క్ ప్రకారం 91.66 కేడీయం నాణ్యత కలిగిన బంగారం రావడం లేదు. దీంతో కొనుగోలు చేసిన వినియోగదారుడు నష్టపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం తులం బంగారం ధర 1.74 లక్షల వర కు విక్రయిస్తున్నారు. ఒకవేళ కొనుగోలుదారుడు విక్రయిస్తే తరువు పేరుతో నిలువునా ముంచుతున్నారు. బులియన్ మార్కెట్ నుండి వంద గ్రాములకొక టి చొప్పున బంగారం కడ్డీలు వ్యాపారులు కొనుగోలు చేస్తారు.ఈకడ్డీలపై 9999 నెంబర్ ఉంటుంది. ఇదీ స్వచ్ఛమైన 916కేడీయం నాణ్యత కలిగిన బంగారం అన్నమాట. అయితే నగరంలోని చాలా దుకాణాల్లో వీటిని కరిగించేటప్పుడు కల్తీచేసి కోట్లకు పడిగెత్తుతున్నట్లు సమాచారం. దీనికి తోడు తూకంలో నూ అక్రమాలకు పాల్పడుతున్నారనే మరో అభియోగం కూడా ఉంది. మరికొందరు దొంగ బంగారాన్ని తక్కువ ధరకే కొని దాన్ని కరిగించి కొత్తబంగారంలో కలిపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

ఈవిషయం సేల్స్‌టాక్స్ అధికారుల కు తెలిసిన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం కమర్షియల్ టాక్స్ అధికారులకు భారీ అమ్యమ్యాలు అందుతుండటంతో వారు మామూలుగా వ్యవహరిస్తున్నారు.

గచ్చిబౌలిలో ఘనంగా 'విజ్ఞాన్ వైభవ్ 2.0'

-భారీగా హాజరైన స్కూల్ విద్యార్థులు- స్టాల్స్‌లో ఆకట్టుకున్న నమూనాలు

ఎక్స్‌పోలో బిడిఎల్ అభివృద్ధి చేసిన క్షిపణుల నమూనాల ప్రదర్శన



ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన షూట్ ఎడ్జ్ వెపన్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గచ్చిబౌలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో శనివారం నిర్వహించిన విజ్ఞాన్ వైభవ్ 2.0 స్పేస్ కన్వెన్షన్, ఎక్స్‌పో ఉత్సాహంగా సాగింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆస్ట్రోనాట్ శుభాన్షు శుక్లా సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో దేశానికే తలమానికమైన పలు అంతరిక్ష, రక్షణ రంగ నమూనాలను ప్రదర్శించారు. నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున హాజరై ఈ నమూనాలను ఆసక్తిగా పరిశీలించారు. ఇస్రో ఆధ్వర్యంలో విజయవంతంగా ప్రయోగించిన చంద్రయాన్ నమూనా, భారత హ్యూమన్ స్పేస్‌ఫ్లైట్ ప్రోగ్రాం గగన్‌యాన్ నమూనాలు ఆకట్టుకున్నాయి. దీంతో పాటు బిడిఎల్ అభివృద్ధి చేసిన భారత రక్షణ రంగం అమ్ములపొదిలోని ప్రధాన క్షిపణులు అస్త్ర, నాగ్, ఆకాశ్, కొంకూర్స్, ద్రువాస్త్రాల నమూనాలను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. జెన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి భారత ఎన్ఎస్‌జీ, కేంద్ర బలగాలకు అందజేసిన షూట్ ఎడ్జ్ వెపన్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రదర్శ నలో భాగంగా అంతరిక్ష వివరాలు, పలు శాటిలైట్ల విశేషాలతో స్పేస్ ఆన్ వీల్స్ పేరుతో బస్సులో ఏర్పాటు చేసిన ప్రదర్శనను విద్యార్థులు ఉ త్సాహంగా తిలకించారు. ఎక్స్‌పోలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులు రూపొందించిన నమూనాలను సైతం ప్రదర్శనలో ఉంచారు.

బాలికలు హెచ్‌పివి టీకాలను వినియోగించుకోవాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ



బాలికకు టీకాను వేస్తుండగా పరిశీలిస్తున్న మంత్రి దామోదర్,రాజ్యసభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్‌లు

గోషామహల్,ఫిబ్రవరి 28(ప్రభాతవార్త): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 90 రోజుల్లో 4నాలుగ లక్షల బాలికలకు ఉచితంగా సింగిల్ డోస్ టీకా లక్ష్యంగా బాలికల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా రాష్ట్రభవిష్యతునతను సురక్షితం చేయవచ్చుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిదామోదర్ రాజనర్సింహ్మ అన్నారు.శనివారం కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో రాష్ట్ర వ్యాప్తంగా(హ్యూమన్ పాపిలోమా వైరస్)టీ కారణ కార్యక్రమాన్ని రాజ్యసభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు.ఈకార్యక్రమాన్ని రాజస్థాన్ ఆజ్మీర్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి వర్చువల్‌గా దేశ వ్యాప్తంగా ప్రారంభించిన జాతీయ కార్యక్రమానికి అనుసంధానంగా నిర్వహించబడింది. కార్యక్రమాన్ని ఆరోగ్య,వైద్య,కుటుంబసంక్షేమ శాఖమంత్రి దామోదర్ రాజ నర్సింహాప్రారంభించారు.రాష్ట్ర వ్యాప్తంగా 14నుండి 15సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 4లక్షల బాలికలకు 90 రోజుల వ్యవధిలో టీకాలు అందించడం లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు.ఆరోగ్యరంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టమని అడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక ముఖ్యమైన ముందడుగు అని తెలిపారు. జీవ నశైలి మార్పులు,ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి కారణాలతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని,తెలంగాణలో ప్రతి సంవత్సరం సుమారు 55వేలనుండి 60వేల క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయన్నారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.3వేల నుండి 4వేల వరకు ఖర్చుయ్యే హెచ్‌పివి టీకాను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తుందన్నారు.తొలి దశలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు,ఏరియా ఆసుపత్రులు కమ్యూనిటి హెల్త్ సెంటర్లలో టీకా అందుబాటులో ఉంటుందన్నారు.ప్రభుత్వం సమగ్ర క్యాన్సర్ పాలసీని రూపొందించిందన్నారు.ములుగు,అదిలాబాద్ వంటి దూర ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలను విస్తరించడంతోపాటు ప్రతి జిల్లాలో డేకేర్‌క్యాన్సర్ సెంటర్లను ఏర్పాట్లు చేశామన్నారు.మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ల ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించే చర్యలు తీసుకుంటున్నామని,ఆరోగ్య,మహిళా క్లీనిక్‌ల ద్వారా విస్తృత పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు.క్యాన్సర్ నోటిఫైబుల్ డిసిజ్‌గా ప్రకటించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.మహిళాల్లో వచ్చే క్యాన్సర్ సర్వైకల్ క్యాన్సర్ రెండవ స్థానంలోఉందని,తెలంగాణ ప్రతి సంవత్సరం సుమారు 32వేల కేసులు నమోదు అవుతున్నాయన్నారు.ఈకార్యక్రమంలో ముందుగా విద్యార్థులు దేవ హర్షిణి,గాయత్రిదేవి, కావ్యశ్రీ, శ్రీలక్ష్మి,హరికలకు హెచ్‌పివి టీకాలు ఇచ్చి వారికి టీకాకరణ సర్టిపికెట్లు అందచేశారు.అర్హత కలిగిన ప్రతి బాలిక టీకా తీసుకునేలా తల్లిదండ్రులు ముందుకు రావాలని మంత్రి దామోదర్ కోరారు. బాలికల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తును,సురక్షితం చేయవచ్చునన్నారు.టీకా కేంద్రంలో పిల్లలతో మాట్లాడి టీకా ప్రాముఖ్యత ను వివరించారు.ఈ కార్యక్రమంలోరాజ్యసభ సభ్యులు మందడి అనిల్‌కు మార్‌యాదవ్, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టిన్ జడ్‌చొంగ్తు, కమీషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ,డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేందర్,డైరెక్టర్ తెలంగాణ వైద్య, విధాన పరిషత్ అజయ్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి,పర్యవేక్షులు సంతోష్ కుమార్,వివిధ విభాగాల వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో 19 మంది పోలీసు అధికారుల పదవీ విరమణ

- ఘనంగా వీడ్కోలు పలికిన కమిషనర్ సజ్జనార్

పదవీ విరమణ పొందిన 19మంది అధికారులతో నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్

హైదరాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘ కాలం సేవలందించి, శనివారం పదవీ విరమణ పొందుతున్న 19 మంది పోలీసు అధికారులకు నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనర్ ఘనంగా వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందుతున్న వారిలో నలుగురు ఎస్.ఐలు, పది మంది ఏఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు,ముగ్గురు ఎల్‌జిఇలు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందుతున్న అధికారులందరికీ తన తరపున, హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం తరపున శుభాకాంక్షలు తెలిపారు. పూర్వం ఫుట్ పెట్రోలింగ్ నుండి ప్రస్తుత ఇన్నోవా పెట్రోలింగ్ వరకు, మారుతున్న కాలానికి అనుగుణంగా మీరు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సుమారు 41 ఏళ్ల పాటు నిబద్ధతతో పనిచేసిన మీలాంటి అనుభవజ్ఞులైన అధికారులు వెళ్తుండటం పోలీసు శాఖకు లోటని, అయితే ఇది సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ఒక కొత్త ఆరంభమని, శేష జీవితాన్ని కుటుంబంతో కలిసి ఆరోగ్యంగా, ఉత్సాహంగా గడపాలని కోరారు. నిత్యం ఏదో ఒక వ్యాపకంతో చురుగ్గా ఉండాలని సూచించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూపంలో వచ్చే నగదును ప్రభుత్వ బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. అధిక లాభాల ఆశ చూపే మోసగాళ్ల పట్ల, ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పదవీ విరమణ పొందిన వారిని గౌరవప్రదంగా చూసుకోవాలని, వారి మానసిక ప్రశాంతతకు కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిపి (అడ్మిన్) కె. వెంకట లక్ష్మి, మహ్మద్ ఇస్మాయిల్ (ఏవో), పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కోఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు మొహమ్మద్ ఆసిఫ్ ఖాన్ (వైస్ ప్రెసిడెంట్), సి.నవీన్ కుమార్ (జాయింట్ సెక్రటరీ), జి.ఎం.ఎస్.విక్టర్ (ట్రెజరర్), డైరెక్టర్లు కె.రత్నకుమారి,ఎ.ఎస్.డి.శాంతి, ఎం.కేశవ్,డి. లక్ష్మణ్‌కుమార్,పి. వినీత్,బి. అప్పలసూరి,కోఆప్టెడ్ మెంబర్లు కె. జనార్దన్ రెడ్డి,కె. శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా : సిఎంసి కమిషనర్ సృజన

స్వచ్ఛఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న కమిషనర్ జి.సృజన తదితరులు

హైదరాబాద్,ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:

డోర్‌టుడోర్ చెత్తసేకరణ వందశాతం జరగాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ జి.సృజన అన్నారు. ఈమేరకు శనివారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లిలో తెల్లవారుజామున ఆకస్మికంగా శానిటేషన్ తనిఖీ నిర్వహించారు. మేడ్చల్ డిప్యూటీ కమిషనర్, ఎస్‌ఆర్ బ్యూఎం బృందాలతో కలిసి ఫీల్డ్ కార్యకలాపాలను సమీక్షించారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో ప్రత్యక్షంగా మాట్లాడి హాజరు విధానం కచ్చితంగా పాటించడంతో పాటు 100 శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ అమలు చేయాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త పారబోయ డం, ఎక్కడ పడితే అక్కడ మురికి వేయడంపై జరిమానాలు విధించాలని సూచించారు. వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. చెరువు సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, గుర్రపు డెక్క తొలగింపు, గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేపట్టాలని అధికారులకు దిశాని ర్దేశం చేశారు.సీఎంసీని పరిశుభ్రమైన, హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నా మని కమిషనర్ సృజన పేర్కొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చి...తల్లి మృతి

సంజన (ఫైల్ ఫోటో)

అడ్డగుట్ట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : బోయిగూడకు చెందిన సంజన (26) అనే మహిళ గాంధీ ఆసుపత్రిలో బిడ్డను ప్రసవించిన కొద్దిసేపటికి మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం సచివాలయంలో పనిచేస్తున్న రితేష్ కు సంజన తో 2025 జూన్ నెలలో వివాహం జరిగింది. దంపతులిద్దరూ నేరేడ్మెట్ లోని కాకతీయ నగర్ లో కాపురం ఉంటున్నారు. ప్రసవం కోసం మూడు రోజుల క్రితం గాంధీ ఆసుపత్రిలో చేరారు. శనివారం తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో సంజనకు నొప్పులు రావడంతో సిజేరియన్ ద్వారా మగ బిడ్డకు జన్మని చ్చింది. ఆ తర్వాత ఆమెను జనరల్ వార్డులోకి మార్చారు. తిరిగి తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో సంజనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా మారింది. దాంతో వైద్యులు ఎంత ప్రయత్నించినా ఆమె ప్రాణాన్ని కాపాడలేకపోయారు. ప్రసవం అనంతరం తమతో సాధారణంగా మాట్లాడిన కూతురు అంతలోనే మృతి చెందిందని, వైద్యుల నిరక్ష్యం కారణంగానే తమ కూతురు చనిపోయిందని సంజన తల్లి, ఇతర కుటుంబ సభ్యులు ఆరోపించారు.

వైద్యుల నిరక్ష్యం లేదు : గైనకాలజీ హెచ్‌ఓడి డాక్టర్ శోభ

సంజనకు వైద్యం అందించడంలో, ఆమె ప్రాణాలను కాపాడడానికి డ్యూటీలో ఉన్న డాక్టర్లు విశ్వప్రయత్నం చేశారని గైనకాలజీ విభాగం హెచ్ ఓ డి, గాంధీ ఆస్పత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శోభ అన్నారు. ఉదయాన్నే తాను ఆసుపత్రికి రాగానే వైద్యులతో, సంజన తల్లితో స్వయంగా మాట్లాడానని అన్నారు. రాత్రి ఒకటిన్నర సమయంలో ఒంటిగంటకు ఆమెకు సిజేరియన్ ద్వారా డెలివరీ జరిగిందని, ఆమెను వార్డుకు మార్చే సమయంలో కూడా సంజన సాధారణంగానే ఉన్నదని అన్నారు. డెలివరీ అయిన తరువాత కొన్ని కణజాలు ఊపిరితిత్తులకు చేరడాన్ని ఎంబాలిజం అంటారని, దానివలన సడెన్ గా ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందిగా మారుతుందని తెలిపారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్లు ఆమెకు సిపిఆర్ చేశారని, సెలైన్ పెట్టి ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకుండ పోయిందని అన్నారు. వైద్యులు ప్రతి రోగిని శ్రద్ధతోనే చూస్తారని, కొన్నిసార్లు పలు రకాల ఆరోగ్య సమస్యల కారణంగా ఇలాంటివి జరుగుతాయని, ఇలా జరగడం తమకు కూడా బాధాకరంగా ఉన్నదని ఆమె అన్నారు.

గుర్రపు డెక్క.. దోమల వ్యాప్తి

-హైడ్రా ఫోన్ ఇన్‌కు కార్యక్రమానికి 28 ఫిర్యాదులు

-తమ ఏరియా చెరువులు అభివృద్ధి చేయాలని విన్నపాలు

అధికారులతో కలిసి ఫోన్‌ఇన్‌ద్వారా ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28,ప్రభాతవార్త:

నగరంలోని చెరువుల్లోకి మురుగు నీరు భారీగా వచ్చి చేరుతోంది. చెరువులు దుర్గంధభరితంగా మారాయి. గుర్రపు డెక్క వ్యాపించి దోమలకు కేంద్రాలుగా నగరంలోని చెరువులు మారాయి. హైడ్రా అభివృద్ధి చేస్తున్న చెరువుల జాబితాలో మా ప్రాంత చెరువును కూడా చేర్చాలని హైడ్రా శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో నగరం నలుమూలల నుంచి విన్నాపాలు వచ్చాయి. చెరువులు, నాలాలు ఆక్రమణకు గురి కాకుండా చూసి వరదలు నివారించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. 28 మందితో హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేరుగా మాట్లాడి.. సమస్యలు తెలుసుకున్నారు. మురుగు నీరు కలవకుండా ఎస్‌టీపీలు ఏర్పాటు చేయాలని సూచించారు. రామంతాపూర్ చిన్న చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే వీటిని ఆపి చెరువును కాపాడాలని స్థానికంగా ఉన్న ఓమహిళ ఫోను చేసి కోరారు. బాచుపల్లి సర్వే నంబరు 54లో 3 ఎకరాల వరకూ భూమి ప్రొహిబిటెడ్ జాబితాలో ఉంది. దీనిని ప్రజావసరాలకు ఉపయోగపడేలా చూడాలని మరో వ్యక్తి కోరారు. ఓల్డ్ అల్వాల్, జొన్నబండలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో పార్కుల ఆక్రమణతో పాటు.. రహదారి ఆటంకాలను తొలగించాలని అక్కడి కాలనీ ప్రతినిధులు కోరారు, ఎల్‌బీనగర్‌లోని వాంబే ఇళ్ల పొందిన కింది పోర్షన్ వారు వాహనాలకు పార్కింగ్ కోసం ఉంచిన స్థలాలను కలిపి అదనపు గదులు నిర్మిస్తున్నారని.. వెంటనే వాటిని తొలగించి నివాసితుల అందరి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. హెచ్‌ఏఎల్ కాలనీలోని ఖర్మన్‌కుంటలో మురుగు నీరు చేరి గుర్రపు డెక్క పెరుగుతుంది అభివృద్ధి చేయాలని కోరారు. నిజాంపేటలోని హిల్‌కౌంటీలో పత్తికుంటకు నాలుగు వైపులా రహదారులున్నాయి. దుర్గంధంతో నిండిన ఈ చెరువును అభివృద్ధి చేస్తే అందరికీ వినియోగంలోకి వస్తుందన్నారు. నల్లగండ్లలోని నల్లగండ్ల చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థకు ఉద్దేశించిన భూమిలో అక్రమ పార్కింగ్ దందా కొనసాగుతోందని ఫిర్యాదు అందింది. ఇలా శనివారం హైడ్రా ఫోన్ ఇన్ కార్యక్రమానికి మొత్తం 28 ఫిర్యాదులందాయి. వీటిని త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగనాథ్ సూచించారు.

పనులు మొదలయ్యాయి.. చూసుకుని వెళ్లండి

- కేబీఆర్ వద్ద ప్రారంభమైన హెచ్ సిటీ పనులు
- ప్రత్యామ్నాయ దారుల్లో వెళ్లాలని సూచిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పనులు ప్రారంభిస్తున్న అధికారులు.

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్తః

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తు న్న కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ హెచ్‌సిటీ పను లను ప్రారంభించారు. శుక్రవారం ఉదయం జీహెచ్ఎంసీ అధికారులు, ఎంఈఐఎల్ భూమి పూజ చేయగా బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని పా ర్కుయహత్ ముందు నుంచి కేబీఆర్ ఉద్యానవనం వైపు దాదాపు ఆరు పిల్లర్లకు సంబంధించిన పను లను శుక్రవారం రాత్రి ప్రారంభించారు. కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ మొదలైన ఈ పనుల నేపథ్యంలో వాహనదారులు గమనించాలని, ప్రత్యా మ్నాయ దారుల్లో తమ గమ్యాలను చేరుకోవాలని నగర ట్రాఫిక్ పోలీసులు సూచించారు. దీనికి తోడు ప్రత్యామ్నాయ మార్గాలను సైతం ఇప్పటికే పలు వేదికలుగా పోలీసు ఉన్నతాధికారులు వెల్ల డించారు. కేబీఆర్ ఉద్యానవనం మీదుగా వెళ్లా ల్సిన వాహనదారులు పనులు ప్రారంభమైన నేప థ్యంలో ఈ ప్రత్యామ్నాయ దారుల్లో ప్రయాణించ డం ద్వారా ట్రాఫిక్‌లో చిక్కుకొనే అవకాశాలు తక్కువగా ఉంటాయి. దీనికితోడు పనులు జరిగే ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు సైన్‌బోర్డులు, ప్రత్యేక ప్లటూన్‌ను ఏర్పాటుచేస్తున్నారు. అలాగే 24 గంటలు అందుబాటులో ఉండేలా క్రేన్‌ను ఏర్పాటుచేస్తున్నారు.

ప్రత్యామ్నాయ దారులివే..

- ముగ్ధ జంక్షన్, కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ మధ్య పనుల నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయంగా ఎన్ఎఫ్‌సీఎల్ నుంచి వచ్చే వాహనాలు శ్రీనగర్ కాలనీ టీజంక్షన్ లేదా సాగర్ సొసైటీ వద్ద మళ్లింపు తీసుకుని, శ్రీ నగర్ కాలనీ మెయిన్ రోడ్-ఇందిరానగర్ లేబర్ అడ్డా-జూబ్లీహిల్స్ రోడ్ నెం.5-వెంకటగిరి ఎక్స్ రోడ్స్ మీదుగా జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ చేరుకోవచ్చు.
- జూబ్లీహిల్స్ రోడ్ నెం.36, 45 నుంచి ఎన్ఎఫ్ సీఎల్ వైపు వెళ్లేవారు జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-వెం కటగిరి రోడ్ నెం.2-యూసుఫ్‌గూడ బస్తీ- యూసుఫ్‌గూడ చెక్ పోస్ట్-మైత్రీవనం-అమీర్‌పేట్ మీదుగా శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట వైపు వెళ్లవచ్చు.
- కేసిపి, బంజారాహిల్స్ రోడ్ నెం.1 నుంచి వచ్చే వాహనాలు బంజారాహిల్స్ రోడ్ నెం.10 మీదుగా క్యాన్సర్ హాస్పిటల్ వద్ద ఎడమ మలుపు తీసుకుని,అగ్రసేన్ ఐలాండ్-భారతీయ విద్యాభవ న్ మార్గంలో జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 చేరుకోవచ్చు.
- మాసబ్ ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలు విరిం చి హాస్పిటల్ (1/12) వద్ద ఎడమ మలుపు తీసుకు ని, అగ్రసేన్ ఐలాండ్-భారతీయ విద్యాభవన్ మార్గంలో జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 వైపు వెళ్లవచ్చు.

వీటిని గమనించండి

వాహనదారులు ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు ఈ మార్గాల్లో ప్రయాణాన్ని వీలైనంతవరకు నివారించాలి. ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులు, సూచనలను తప్పనిసరిగా అనుస రించాలి. తాజా ట్రాఫిక్ సమాచారం కోసం గూగు ల్ మ్యాప్స్ వంటి నావిగేషన్ యాప్‌లను విని యోగించాలి. రద్దీ తగ్గించేందుకు ప్రజారవాణా, కార్ పూలింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. భారీ వాహ నాలు పీక్ అవర్స్‌లో ఈ మార్గాల్లో ప్రయాణిం చవద్దు. తాజా సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సోషల్ మీడియా వేదికలను అనుసరించడం తోపాటు అత్యవసర పరిస్థితుల్లో 9010203626 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చని అధికారులు తెలిపారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం : హన్మంత్ రెడ్డి

నూర్జహాన్‌కు చెక్కును అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 283 డివిజన్ బి .జె .ఆర్ నగర్ వాసులు ఎం.డి నూర్జహాన్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. చికిత్సకి సరిపడ్డ డబ్బులు లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 1,75,000 సీఎం సహాయనిధి ఎల్వోసీని మంజూరి చేయించారు. మంజూరి అయియిన పత్రాలను ఎం.డి నూర్జహాన్‌కు శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన గుమ్మడి మధుసూదన్ రాజు



పొనం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న గుమ్మడి మధుసూదన్ రాజు

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల 132 డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గుమ్మడి మధుసూదన్ రాజు ముదిరాజ్ రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌ను శనివారం కలిశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హనుమంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన గుమ్మడి మధుసూదన్ రాజు, కాంగ్రెస్ ప్రజాపాలనకు ఆకర్షితులై పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో మంత్రి పొనం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలియజేసి, నియోజకవర్గ అభివృద్ధి విషయాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగయ్య, కూన నవీన్ కుమార్ గౌడ్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్ లింగంపల్లిలో అన్నదానం

కార్యక్రమంలో పాల్గొన్న రాజేష్ కుమార్ అగర్వాల్ తదితరులు

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : బాగ్ లింగంపల్లిలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు రోషన్ లాల్ అగర్వాల్ ఫౌండేషన్ ట్రస్ట్, రాజేష్ కుమార్ అగర్వాల్ సౌజన్యంతో శనివారం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక లంబాడీ సామాజిక వర్గీయులు తమ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంబాడీ సామాజిక వర్గీయులు తమ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేవాలాల్ బోధనలు స్ఫూర్తిదాయకం అని రాజేష్ కుమార్ అగర్వాల్ అన్నారు. సుమారు 2,000 మంది భక్తులు, స్థానిక నివాసితులు ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, అంజి యాదవ్, కె. రఘు వీర్, లోకేష్ యాదవ్, పీపల్ గంగాధర్, నవీన్ నాయక్, బాలు నాయక్, కరణ్ నాయక్, దర్యా నాయక్, గోపాల్ నాయక్, కళ్యాణ్ నాయక్, దేవేందర్ నాయక్, నారాయణ నాయక్, రెడ్యా నాయక్, దావునా నాయక్ పాల్గొన్నారు.

3న పాక్షిక చంద్రగ్రహణం..చిక్కడపల్లి శ్రీవారి ఆలయం మూసివేత

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త) : మార్చి మూడన ఉదయం చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయాన్ని కేతు గ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మూసివేయనున్నట్లు ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్ గౌడ్, సహాయ కమీషనర్ కె.రామాంజనేయులు వివరించారు. మార్చ్ 3 మంగళవారం ఉదయం ప్రాత:కాల పూజ అనంతరం ఆలయాన్ని మూసివేసి భక్తుల దర్శనాలను నిలిపివేనున్నారు. మధ్యాహ్నం 3.30 ప్రారంభమయ్యే పాక్షిక చంద్రగ్రహణం సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. గ్రహణ కాలము ముగిసిన అనంతరము మరలా రాత్రి 07:00 గం.లకు ఆలయము ద్వారములు తీసి మహా సంప్రోక్షణ నిర్వహించి అనంతరము యథావిధిగా ద్వార బంధనము చేయబడుతుంది, తిరిగి 4న బుధవారం రోజున ఉదయము యథావిధిగా దేవస్థానము ద్వారములు తెరువబడుతుందన్నారు.

ఘనంగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో జాతీయ సైన్స్ డే

జీడిమెట్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

జాతీయ సైన్స్ డే సందర్భంగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో వివిధ విద్యాసంస్థల్లో నేషనల్ సైన్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. టీవీఆర్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి మార్గదర్శకత్వంలో టీవీఆర్ మోడల్ హై స్కూల్ (అపురూప కాలనీ), సత్యవాణి విద్యానికేతన్ (ఎస్.ఆర్. నాయక్ నగర్), బచ్పన్ ఒలంపియాడ్ స్కూల్ (చింతల్), బచ్పన్ ప్లే స్కూల్ (సూరారం)లలో సైన్స్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త సి. వి. రమణ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. రామన్ ఎఫెక్ట్‌కు నోబెల్ బహుమతి లభించిన సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ డే జరుపుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 5వ తరగతి నుండి 7వ, 8వ తరగతి విద్యార్థులు వివిధ శాస్త్రీయ నమూనాలు తయారు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసిన సైన్స్ అధ్యాపక బృందాన్ని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి దీక్ష జూనియర్ కాలేజీ డైరెక్టర్ డా. సూరా రవిచంద్రారెడ్డి హాజరై విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్స్ దీప్తి రెడ్డి అభినందించారు.

నెక్నాంపూర్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి : షాహెచ్ అన్సారీ

బేగంబజార్, ఫిబ్రవరి 28ప్రభాతవార్త:

రంగారెడ్డిజిల్లా గండిపేటమండలం, మణికొండ గ్రామంలోని సర్వే నెంబర్ 53,53పార్ట్ 54/లోన లేక్‌వ్యూ ప్లాట్ నెంబరర్ 3 వద్ద అక్రమంగా 375 చదరపుగజాల స్థలంలో గ్రౌండ్ ప్లస్2 అంతస్థులతో కూడిన విల్లాలు, వ్యక్తి గత నివాస భవనాల నిర్మాణంజరుగుతుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు షాహెత్ అన్సారీ ఆరోపించారు. ఈమేరకు శనివారంఆయన నెక్నాంపూర్‌లోన బఫర్‌జోన్ పరిధిలోని లేక్‌వ్యూలో జరుగుతున్న అక్రమాలపై హైడ్రా కమీషనర్ ఎ.వి.రంగనాథ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం జాంబాగ్‌లోఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓ పక్కన హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలు తొలగిస్తుండగా, జిహెచ్‌ఎంసి అధికారులు నిర్మాణదారులతో కుమ్మకై బఫర్‌జోన్‌లో సైతంభవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తూ, అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్లుఆరోపించారు. నెక్నంపూర్ గ్రామం సర్వే నెం.53,54పార్ట్ 54/ఎలోని అక్రమంగా నిర్మిస్తున్న భవనాలకు జిహెచ్‌ఎంసి ఎలా అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఇటీవల కాలంలో నగరంలోని సరస్సులు, ఉద్యానవనాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్నచర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. హైడ్రా కమీషనర్ ఎ.వి రంగనాథ్ నేతృత్వంలోఅన్యాక్రాంతమైన కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కాపాడారని గుర్తుచేశారు. ఇదే విధంగా మణికొండ మండల పరిధిలోని నెక్నంపూర్, లేక్‌వ్యూ కాలనీ బఫర్‌జోన్‌లోన అక్రమంగా కొనసాగుతున్న భవన నిర్మాణాలను అడ్డుకోవాలని హైడ్రా కమీషనర్‌ను కోరారు. భవననిర్మాణ అనుమతులు రద్దు చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్న యాజమానిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తన్మయుల్ని చేసిన భక్తకన్నప్ప పౌరాణిక పద్యనాటకం

భక్తకన్నప్ప పౌరాణిక పద్యనాటకం శ్రీకాళహస్తీశ్వర సాయుజ్యమ్‌లోని దృశ్యాలు

నాంపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థల సౌజన్యంతో మోడరన్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహాయ సహకారాలతో అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడిన శ్రీకాళహస్తీశ్వర సాయుజ్యమ్ - భక్తకన్నప్ప పౌరాణిక పద్యనాటకం విచ్చేసిన అశేష రంగస్థల ప్రియుల్ని, ఔత్సాహిక ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది. పరమశివుని సాయుజ్యం పొందడానికి కేవలం భక్తిప్రపత్తులే ప్రముఖమని చాటిచెప్పిన దీపికా ప్రసాద్ రచన–దర్శకత్వం, అద్దేపల్లి రాజ్‌కుమార్ నిర్వహణ, ఆహ్లాద క్రియేటివ్ థియేటర్, హైదరాబాద్ వారి సమర్పణలో శివుడుగా డా. పిల్లుట్ల లక్ష్మీకాంతశర్మ, తిన్నడుగా భాగి శివశంకరశాస్త్రిలతోపాటు ఇతర ప్రధానపాత్రల్లో సురభి రమాలక్ష్మి, వడ్డే సూర్యప్రకాష్, దీపికాప్రసాద్, మల్లాది వెంకటరమణ, సూర్యనారాయణమూర్తి, సిహెచ్‌విఆర్. మూర్తి, అద్దేపల్లి రాజ్‌కుమార్, శ్రీనివాసరావు తదితర అపూర్వ నటన ఆహుతులను మెప్పించి ప్రశంసలందుకున్నారు. అనంతరం బాపనపల్లి వెంకటస్వామిచే రావణబ్రహ్మ ఏకపాత్రాభినయం అబ్బురపరిచింది. చివరిగా అతిథుల చేతులమీదుగా నటీనటులను ఘనంగా సన్మానించారు.

నేటి నుండి కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ప్రచారం

పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, బి రాము, డి జి ప్రసాద్,

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 , ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నేటి నుండి గ్రామాల్లో ప్రచారం, రాష్ట్రపతికి వినతి పత్రాలు పంపడం మార్చి 9న ఢిల్లీలో కిసాన్ మజ్దూర్ పార్లమెంటు నిర్వహిస్తామని శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, బి రాము, డి జి ప్రసాద్, మండల వెంకన్న, బుర్రి ప్రసాద్, జక్కుల వెంకటయ్య, మామిడాల బిక్షపతి , విజయ్ లు పిలుపునిచ్చారు. కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశం అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ బిల్లు 2025, విత్తన బిల్లు 2025 ఉపసంహరించాలని, విబి గ్రామ్జ్ చట్టం 2025 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు, గ్రామసభలు నిర్ణయించిన విధంగా గ్రామీణ ప్రజలకు పని హామీ ఇచ్చే ఎం ఎన్ఆర్ ఈ జి ఏను రద్దు చేస్తూ విబి గ్రామ్జ్ చట్టాన్ని విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బహుళ జాతి కంపెనీల విత్తనాలను దిగుమతి చేసుకోవడం, ఇష్టానుసారంగా వసూలు చేసే స్వేచ్ఛ , విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ చేయడానికి అనుమతించే కొత్త విత్తన బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తున్నదని జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాలకు 60 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల నిర్వహిస్తున్న పోరాటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదే రకంగా ప్రధాన ప్రతిపక్షం అండగా నిలబడాలని కోరారు.

కరెంటోళ్ల ప్రజా బాటలో సిఎండి...

-బంజారాహిల్స్ సర్కిల్‌లో విద్యుత్ నెట్‌వర్క్ పరిశీలన

-మోతీనగర్‌లో స్థానిక వినియోగదారులతో మాటామంతి

మోతీనగర్‌లో స్థానికలతో మాట్లాడుతున్న సిఎండీ జితేష్ విపాటిల్, డైరెక్టర్ నర్సింహులు, శివాజీ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజే సిఎంఈడ జితేష్ వి పాటిల్ క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లారు. కరెంటోళ్ల ప్రజాబాటలో భాగంగా బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మోతీనగర్ సెక్షన్‌లో శనివారం విద్యుత్ నెట్ వర్క్‌ను పరిశీలించి అక్కడి అధికారులు, సిబ్బందితో కలిసి తిరిగారు. అలాగే స్థానికులను కలిసి వారితో ముచ్చటించి విద్యుత్ సంబంధిత సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మోతీనగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పోల్ మౌంటెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ను ఆయన ప్రారంభించారు. ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ ముందస్తు సూచనల నేపథ్యంలో విద్యుత్ వినియోగం భారీ స్థాయిలో పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యంగాపని చేస్తున్న తమ సంస్థ అధికారులు, సిబ్బంది తగు ఏర్పాట్లు చేపట్టారన్నారు. ఈ పర్యటనలో సంస్థ డైరెక్టర్ డా. నరసింహులు, వి శివాజీ, బంజారా హిల్స్ సూపెరింటెండింగ్ ఇంజినీర్ నరసింహులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

అల్వాల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: అల్వాల్‌లో టైలర్స్ డే ఉత్సవం ఘనంగా జరిగింది. మేరు సంఘం తెలంగాణా జోన్ 11(అల్వాల్) ఆధ్వర్యంలో లోతుకుంట లోని కార్యాలయంలో జరిగిన ఉత్సవంలో పెద్ద సంఖ్యలో టైలర్స్ పాల్గొన్నారు. కుట్టు మిషన్ సృష్టి కర్త విలియమ్స్ హోవే జయంతిని ప్రపంచ వ్యాప్తంగా టైలర్స్ డేగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా ఉంది. కుల వృత్తి అయిన టైలరింగ్‌పై ఆధార పడి ఉన్న లక్షలాది మంది ఆర్థికంగా సామాజికంగా వెనుకపడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి పెన్షన్, హెల్త్ కార్డ్, ఇళ్ళ స్థలం, మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జీడిమెట్ల పరిసర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

జీడిమెట్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

జీడిమెట్ల 1 సబ్ స్టేషన్ పరిధిలో..11కేవీ ఏపీఐఐసీ ఫీడర్, 11కేవీ రైతుబజార్ ఫీడర్, 11కేవీ షాపూర్‌నగర్ ఫీడర్‌లలో మధ్యాహ్నం 2గంటల నుండి 3 గంటల వరకు ఏపీఐఐసీ కాలనీ, రైతుబజార్, షాపూర్‌నగర్ మెయిన్‌రోడ్, కళావతి నగర్, న్యూషాపూర్‌నగర్, సంజయ్‌గాంధీ నగర్, ఎన్ ఎల్ బి నగర్ ప్రాంతాలు..

జీడిమెట్ల3 సబ్ స్టేషన్ పరిధిలో..

11కేవీ పైప్‌లైన్ ఫీడర్, 11కేవీ యుఎస్పి ఆర్గానిక్స్ ఫీడర్, 11కేవీ వినాయక ఫీడర్ లలో మధ్యాహ్నం 3గంటల నుండి 5 గంటల వరకు గంపలబస్తీ, సుభాష్‌నగర్, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతం, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని జీడిమెట్ల ఏఈఓ ప్రకటనలో తెలియజేశారు.

రొయ్యూరు జోగేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పించిన పూర్వ గవర్నర్ దత్తాత్రేయ

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త) : అనారోగ్యంతో మరణించిన ప్రముఖ స్వతంత్ర సమరయోధులు రొయ్యూరు జోగేశ్వరరావు భౌతికకాయానికి హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం నివాళులు అర్పించిన కుటుంబ సభ్యులను ఓదార్చారు. విద్యానగర్ లోని జోగేశ్వర్ రావు నివాసానికి చేరుకుని మొదట జోగేశ్వర్ రావు భౌతికకాయానికి నివాళులు అర్పించారు. జోగేశ్వరరావు సమాజ సేవలో అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అడిక్ మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిమ్స్ ఆసుపత్రికి 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్' పురస్కారం

అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ పద్మజ, ప్రొఫెసర్ విజయ్‌కుమార్.

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

నిమ్స్‌కి మెడికల్ కాలేజెస్ రీసర్చ్ కనెక్ట్ 2026 జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ పురస్కారం లభించింది. ఆరోగ్య పరిశోధన విభాగం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో 2026–27 సంవత్సరానికిగాను నిర్వహించిన సదస్సులో దేశవ్యాప్తంగా వందకుపైగా మెడికల్ కళాశాలలు పాల్గొన్నాయి. మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ల (ఎంఆర్‌యూఎస్) పనితీరును పరిశీలించి, అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన సంస్థలకు ఈ అవార్డును అందించారు. నిమ్స్ చేపట్టిన పరిశధోన కార్యక్రమాలు, నూతన ఆవిష్కరణలు, శాస్త్రీయ ప్రతిపాదనలకు ఈ గౌరవం దక్కింది. నిమ్స్ ఆసుపత్రి తరుపున ఈ అవార్డును ప్రొఫెసర్ పద్మజ, ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌లు ఐసీఎం ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ నుంచి అందు కున్నారు. దేశస్థాయిలో లభించిన ఈ గౌరవం తమ పరిశోధకుల అంకితభావానికి ప్రతిఫలమని నిమ్స్ డైరక్ట ర్ డాక్టర్ బీరప్ప అన్నారు. నిమ్స్ డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్ సైతం అవార్డు రావడం పట్ల తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మౌలానా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాద్రి

చార్మినార్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకని ఏఐఎస్‌ఎస్‌సి జాతీయ కన్వీనర్ మౌలానా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాద్రి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పాతబస్తీ కోకాకితట్టిలో కౌన్సిల్ ఏఐఎస్‌ఎస్‌సి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కలిసి మెలిసి ఐకమత్యంతో ఉత్సవాలు జరుపు కుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మౌలానా ముర్తుజా పాషా, మౌలానా అలీ ఖాద్రి, మౌలానా సాదత్ ఫిర్ బుక్దాదీ, మౌలానా సుజా ఇఫ్తెకార్ పాల్గొన్నారు.

హత్యకేసుల్లో ఐదుగురు నిందితులు అరెస్ట్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డి.సి.పి కృష్ణగౌడ్, ఈచిత్రంలోఎ.సి.పి ఎస్.సుదర్శన్, సిఐ రాఘవేంద్ర

బేగంబజార్, ఫిబ్రవరి 28ప్రభాతవార్త: పాత కక్షల కారణంగా ఒక యువకున్ని 8మంది యువకులు హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న 5మంది నిందితులను అరెస్టు చేసి మంగళ్‌హాట్ పోలీసులు మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోషామహల్ ఎ.సి.పి ఎస్.సుదర్శన్, మంగళ్‌హాట్ సిఐ రాఘవేంద్రతో కలిసి గోల్కొండ జోన్ అదనపు డి.సి.పి కృష్ణగౌడ్ మాట్లాడుతూ... అరాంఘర్ కాలని ప్రాంతానికి చెందిన రామేశ్వర్ అగర్వాల్ కుమారుడు రిషబ్ అగర్వాల్‌తో జుమ్మెరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారి మున్నాసింగ్, లడ్డుసింగ్‌ఎలియాస్ లడ్డుతో పరిచయం చేసుకున్నాడు. ఓ కేసు విషయంలో తాను చర్లపల్లిలో జైల్‌లో తన ప్రత్యర్ధి ముతా సభ్యుడితో కలిసి ఉన్నట్లు చెప్పాడు. మున్నాసింగ్, లడ్డుసింగ్‌లు రిషబ్‌అగర్వాల్ తన ప్రత్యర్ధి ముతాతో చేతులు కలిపాడనే అనుమానంతో మున్నాసింగ్‌కు కలిగింది. ఏది ఏమైన్నప్పటికి తాను రిషబ్‌అగర్వాల్‌ను హత్యచేయాలని ప్లాన్ రూపొందించుకుని తనస్నేహితులైన మంగళ్‌హాట్ టక్కర్‌వాడి ప్రాంతానికి చెందిన మద్దూర్‌ప్రణయ్‌కుమార్, తిప్పని ఉదయ్‌కిరణ్, కుశంగల్ ఓంప్రకాష్, ,కిరాణా షాపు కార్మికుడు అమినేష్‌సింగ్, కునాల్‌సింగ్, మామ్‌తో కలిసి ఈనెల 25వ తేదిన రిషబ్ అగర్వాల్‌పై దాడికి దిగారు. 8మంది దెబ్బలకు తట్టుకోలేక రిషబ్‌అగర్వాల్ సృహ్హతప్పి పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు కింద పడిపోయిన రిషబ్‌అగర్వాల్ వద్దకు వెళ్లి చూడగా సృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూడగా 8మంది దాడి చేయడంతో రిషబ్ అగర్వాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి శవ పంచనామా జరిపి ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మంగళ్‌హాట్ పోలీసులు రంగంలోకి దిగి మున్నాసింగ్, లడ్డుసింగ్ ఎలియాస్ లడ్డు, మద్దూర్‌ప్రణయ్‌కుమార్, తిప్పని ఉదయ్‌కిరణ్, కుశంగల్ ఓంప్రకాష్, కిరాణా షాపు కార్మికుడు అమినేష్‌సింగ్, కునాల్‌సింగ్, మామ్ హత్యలో ఉన్నట్లు పోలీసులు సి.సి.టివీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. విశ్వసనీసమాచారం మేరకు మంగళ్‌హాట్ పోలీసులు ఐదుమంది నిందితులనను అరెస్ట్‌చేసి విచారించారు. పోలీసుల విచారణలో నిందితులను నేరాన్ని అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కోర్టులోన హాజరు పర్చగా మేజిస్ట్రేట్ నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ 48గంటల సమయంలోనే హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న 8మందిలో 5మందిన్ని అరెస్ట్‌చేశారు. మరో ముగ్గురు తప్పించుకు తిరుగతున్నట్లు చెప్పారు. ఈ కేసును మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగింపు

అల్వాల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: మచ్చబొల్లారం మార్కెట్ ప్రధాన రహదారి ఆక్రమణలను శనివారం అధికార యంత్రాంగం తొలగించడం జరిగింది. జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ విభాగాలకు చెందిన యంత్రాంగం చేపట్టిన ఆక్రమణలు తొలగింపు సందర్భంగా స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. అధికారుల చర్యను బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. పేదలుపై కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దమనకాండను కొనసాగిస్తోందని మాజీ కౌన్సిలర్ డోలి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులను రోడ్డుపై పడేశారని పేర్కొన్నారు. దశాబ్దాలుగా తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారులు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మచ్చబొల్లారం పరిసర ప్రాంతాలు వేగంగా విస్తరించిన నేపథ్యంలో ఉదయం సాయంత్రం వేళలలో ట్రాఫిక్‌కు మార్కెట్ వద్ద తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయి. మల్కాజిగిరి జోన్ ట్రాఫిక్ డిసిపి లక్ష్మీ పర్యవేక్షణలో జిహెచ్‌ఎంసితో కలిసి స్పెషల్ డ్రైవ్‌ను చేయడం జరిగింది. నగర కమీషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేశారు. రోడ్డు ఆక్రమణలు ఎక్కడ ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకుని రావాలని ఆమె కోరారు.

గ్రహణ సమయంలో ఈ నక్షత్ర జాతకులు చూడొద్దు

..బ్రహ్మశ్రీ పులిగడ్డ హనుమంతరాయశర్మ

ప్రసంగిస్తున్న బ్రహ్మశ్రీ పులిగడ్డ హనుమంతరాయశర్మ

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : మార్చి మూడన సంభవించే కేతు గ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా కొన్ని నియమాలు పాటించాలని కళ్యానంద పీఠం అధినేత, ప్రముఖ వేదపండి తులు బ్రహ్మశ్రీ పులిగడ్డ హనుమంతరాయ శర్మ వివరించారు. శనివారం చిక్కడపల్లి లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రహణ సమయంలో జపాలు గ్రహణ పట్టు విడుపు స్నానాలు చేయాలని, గ్రహణము పుబ్బ, ముఖ నక్షత్ర జాతకులు సింహ కుంభ రాశి వారు గ్రహణాన్ని చూడరాదన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు సంప్రోక్షణ అనంతరం యధావిధిగా పరివార దేవతలకు పూజలు నిర్వహించాలన్నారు.

సిఎండీ జితేష్ పాటిల్‌ని కలిసిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్లు

సిఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంజయ్య, వెంకటేశ్వర్లు, పరమేష్, అనిల్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

టిజిఎస్‌పిడిసిఎల్ నూతన సిఎండిగా బాధ్యతలు చేపట్టిన జితేష్ వీ పాటిల్ ను విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం సిఎండీ ఛాంబర్‌లో మర్యాదపూరంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, అందరూ సంస్థ మనుగడ కోసం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సిఎండి కోరారు. సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్యోగులంతా కష్టపడి పని చేస్తారని, వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తమ అసోసియేషన్ తరపున పూర్తి సహకారం అందిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, డిస్కం సెక్రటరీ కె. వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సిఎండీని కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు పరమేష్, అనిల్, కొండారెడ్డి రవి, వాసు ఉన్నారు.

మైసిగండి మైసమ్మ ఆలయంలో పూజలు

అమ్మవారికి పూజలు చేసిన గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జె.ఎ.సి చైర్మన్ బేరా బాలకృష్ణ

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 28ప్రభాతవార్త:

చారిత్రాత్మకమైన కడ్తాల్‌లోని మైసిగండి మైసమ్మకు గ్రేటర్ హైదరాబాద్ మాల జె.ఎ.సి చైర్మన్ బేరా బాలకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతకంగా ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరినట్లు చెప్పారు. ఆలయ కమిటి నిర్వాహకులు పలువురిని శాలువ కప్పి సన్మానించారు.

సుల్తాన్‌బజార్ సిఐ నరేష్‌కు సన్మానం

గన్‌ఫౌండ్రి, ఫిబ్రవరి 28ప్రభాతవార్త: రాబోయే పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సుల్తాన్‌బజార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.నరేష్ ప్రజలను కోరారు. ఇటీవల సుల్తాన్ బజార్ సిఐగా పదవి భాద్యతలు చేపట్టారు. ఈమేరకు ఇసామియాబజార్ వెల్ఫేర్ కమిటి ప్రతినిధులు బద్దం సతీష్‌గౌడ్, దిలీప్‌ఘనాటే, గులాబ్‌శ్రీనివాస్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సిఐ నరేష్‌నుశాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా వ్యక్తి ఆత్మహత్య

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ముప్పాల రేవంత్ కుమార్ (38), నాలుగు సంవత్సరాల క్రితం తన స్వగ్రామం తిరుపతి నుండి భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి, యూనిటీ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ పద్మానగర్ ఫేజ్–2 ప్రాంతంలో నివసిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం వివిధ వ్యక్తుల వద్ద అప్పులు చేసినట్లు తెలిసింది. అయితే అప్పులు పెరుగుతూ ఉండటంతో వాటిని తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురై, తీవ్ర మనస్తాపానికి లోనైన రేవంత్ కుమార్, శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డబుల్ బెడ్‌రూమ్‌లు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తులపై కేసు

ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : డబుల్ బెడ్‌రూమ్‌లు ఇప్పిస్తానని పలువురి వద్ద నుంచి డబ్బులు దండుకుని మోసం చేసిన ఐదుగురు వ్యక్తులపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ చర్చికాలనీలో నివసించే మరియమ్మ, జార్జ్ అనే వ్యక్తులు స్థానికంగా చర్చి నిర్వహిస్తున్నారు. వీరికి అదే ప్రాంతంలో నివసించే శంకరయ్య, శ్రీనివాస్, మహ్మద్ అనే వ్యక్తులు కలిసి స్థానికంగా ఉంటున్న పలువురి వద్ద నుంచి డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. దీంతో గత రెండేళ్ల నుంచి పలు మార్లు వీరు స్థానికంగా ఉంటున్న పేదల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంవత్సరాలు గడుసున్నా ఇళ్లు రాకపోవడంతో మోసపోయినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చర్చికి వచ్చే వారి వద్ద నుంచి సుమారు రూ.కోటిన్నర వరకు వసూలు చేసినట్లు బాధితులు వాపోతున్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిజం ఎప్పటికి గెలుస్తుంది : ఆప్ నేత విజయ్‌రెడ్డి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

నిజం ఎప్పటికి గెలుస్తుందని, ఈ విషయం అమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ విషయంలో రుజువైందని అమ్ ఆద్మీ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుడు విజయ్‌రెడ్డి ముల్లంగి అన్నారు. జూబ్లీహిల్స్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేజ్రీవాల్ విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు దేశ రాజకీయ చరిత్రలో ఒక కీలక ఘట్టమని అన్నారు. కేసులో ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసిందని, తప్పుడు కేసు కారణంగా కేజ్రీవాల్ జైలుశిక్షను సైతం అనుభవించారన్నారు. ఇది ప్రజాస్వామ్య విజయమని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రత్యర్థులను అణగదొక్కడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందన్నారు. రాజకీయ కక్ష సాధింపులోనే ఇవన్నీ చేశారన్నారు. అమ్ ఆద్మీని ఎదుర్కొనలేక ఇలాంటి కుతంత్రాలు పన్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు అమ్ ఆద్మీ పార్టీకి తప్పనిసరిగా అండగా నిలుస్తారని అన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ నుంచి తాను బరిలోకి దిగుతానని ఆయన స్పష్టం చేశారు.

ఎంఎన్‌జేఐఓ, ఆర్‌సిసి ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా డా. సదాశివుడు గుండేటి నియామకం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

తెలంగాణ ప్రభుత్వం మెహది నవాజ్ జంగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్(ఎంఎన్‌జేఐఓ, ఆర్‌సిసి) ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా డా. సదాశివుడు గుండేటి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మెడికల్ ఆంకాలజీ విభాగంలో ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పరిపాలనా కారణాల దృష్ట్యా ఆయనకు ఈ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు రేడియోథెరపీ ప్రొఫెసర్ డా. జోసెఫ్ బెంజమిన్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పుడు ఆ స్థానంలో సదాశివుడుని నియమించారు. ఈ నియామకం తక్షణం అమల్లోకి వచ్చి, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగుతుంది.

రంజాన్ సందర్భంగా పేదలకు రేషన్ కిట్లు పంపిణీ

పేద మహిళలకు రేషన్ కిట్లు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు అభిషేక్ అడపా, షేక్‌గౌస్ తదితరులు.

బేగంపేట ఫిబ్రవరి 28,ప్రభాతవార్త

పేద,ఒంటరి మహిళలకు అండగా రంజాన్ పర్వదినం పురస్కరించుకొని బేగంపేట కాంగ్రెస్ యువ నాయకుడు అభిషేక్ అడపా, షేక్ గౌస్‌ల ఆధ్వర్యంలో శనివారం ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో రంజాన్ కానుకగా రేషన్ కిట్లను పంపిణీ చేసారు. రంజాన్ పవిత్ర మాసంలో మైనార్టీలు ఎంతో పవిత్రంగా రోజా చేస్తారని, వారికి నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని కాంగ్రెస్ యువ నాయకుడు అభిషేక్ అడపా అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ నేతృత్వంలో బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో పేద,ఒంటరి మహిళలకు (బియ్యం, కందిపప్పు,గోధుమపిండి,నూనె,మూడు రకాల పప్పులు) రేషన్ కిట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అభిషేక్ అడపా మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసం లో ముస్లీం సోదరులు ఎంతో పవిత్రంగా ప్రార్ధనలు నిర్వహిస్తుంటారని, వారికి తమ వంతుగా రేషన్ కిట్లను పంపిణీ చేయడం పవిత్ర కార్యంగా భావిస్తున్నామన్నారు. కోట నీలిమ నేతృత్వంలో బేగంపేట డివిజన్ లో పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పేదలకు అన్ని వేళలా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ గౌస్, సి.రాజేందర్, హనీఫ్‌ఖాన్, మునీర్‌ఖాన్, అల్తమాష్, బబ్లూ, ఆయూబ్, కృష్ణ, అక్బర్, వజీద్, అడ్డు, నవాజ్, జమీర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి సిఎంఆర్ఎఫ్ మేలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

మెరుగైన వైద్యానికి ఎల్ఓసీపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: పేద ప్రజలకు కార్పోరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. తిరుమలగిరి లాల్‌బజార్ ప్రాంతానికి చెందిన సత్య నారాయణ గౌడ్ సతీమణి రమాదేవి అనారోగ్యంతో బాధపడుతుంది. మెరుగైన వైద్యానికి ఆసుపత్రిలో అత్యవసర ఆపరేషన్ చేయించుకునేందుకు సిఎం.ఆర్.ఎఫ్. నుంచి మంజూరైన 2.5 లక్షల ఎల్ఓసీని శనివారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ కార్పోరేట్ ఆసుపత్రుల కంటే దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు పనిచేస్తున్నాయన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు మృత్యువాత పడకుండా సిఎం.ఆర్.ఎఫ్.ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మురళీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి ఉప విద్యాశాఖ అధికారిగా పరమేశ్వరమ్మ

మారేడ్‌పల్లి ఉప విద్యా అధికారిని సన్మానిస్తున్న రిగగ్నైజిడ్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: మారేడ్‌పల్లి మండల్ ఉప విద్యా శాఖ అధికారిగా పరమేశ్వరమ్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మారేడ్‌పల్లి మండల్ ప్రైవేట్ రిగగ్నైజిడ్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నర్సింహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్.శ్రీధర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శాంత్ రెడ్డి, ఛీఫ్ అడ్వైజర్లు కిషన్ ప్రసాద్, షేక్‌సయ్యద్ అహ్మద్, లక్ష్మారెడ్డి, చిన్నయ్యలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలి : కేథరీన్ థెరిసా

సైఫాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: ఇటీవల ప్రతి ఒక్కరూ లైఫ్ స్టైల్, ఫిట్‌నెస్, ఆరోగ్యంపై శ్రద్ధ ఎక్కువగా చూపిస్తున్నారని సౌతిండియన్ గ్లామరస్‌హీరోయిన్ కేథరీన్ థెరిసా చెప్పారు. ప్రజలంతా ఆరోగ్యంగా జీవించాలని, ఫిట్‌గా ఉండేందుకు సరైన ట్రీట్మెంట్ తీసుకోవాలని ఆమె కోరారు. శనివారం హిమాయత్‌నగర్‌లో 'కలర్స్ హెల్త్ కేర్ 2.0' ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అధునిక సాంకేతికతో రూపుదిద్దిన సౌకర్యాలను పరిశీలించిన ఆమె సంస్థ అందిస్తున్న సేవలను ప్రసంసించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కూన వెంకటశివాజీ మాట్లాడుతూ తమ సంస్థ 22 సంవత్సరాల్లో 55 బ్రాంచీలను ఏర్పాటు చేసి 2,500 మందికి ఉపాధి కల్పిస్తున్నదని చెప్పారు. కేథరీన్ థెరిసాను చూడటానికి పెద్ద ఎత్తున అభిమానులు తరలి వచ్చారు. ఆమె అభిమానులం దరితో ఫోటోలు దిగి సంతోషపరిచారు.

15న ఓయూలో ఉద్యమకారుల సమ్మేళనం : పిడమర్తి రవి

సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

సైఫాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం మార్చి 15న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కొనసాగుతుందని ఉద్యమకారులంతా పాల్గొనాలని తెలంగాణ ఉద్యమకారులు, ఎస్సీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పింఛన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో 250 గజాల స్థలంపై ప్రకటన చేయాలని, అప్పటి వరకు ఉద్యమకారులు గుర్తు చేస్తూనే ఉంటారని ఆయన చెప్పారు. గత సిఎం కెసిఆర్ ఉద్యమకారులను పట్టించుకోకపోవడం వల్లనే ఉద్యమకారులు స్థలం కోసం ఎదురు చూసే దుస్థితి వచ్చిందని, ఉద్యమకారులకు కెసిఆర్ విస్మరించిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. 250 గజాల స్థలం సాధించే తవరకు ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో శ్యాం, ఉషారాణి, వరలక్ష్మి, మల్లేష్, సురేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా మార్చి నెల 1వ తేదీ ఆదివారం 11 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అత్తాపూర్ గ్రామం, సిబిఐటి కాలనీ, సోమిరెడ్డి నగర్, ఏషియన్ థియేటర్, పటేల్ హోటల్, వీకర్ సెక్షన్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు చార్మినార్ విద్యుత్ అధికారులు తెలిపారు.

గ్రామీణ నిరుద్యోగ యువతి,యువకులకు కేంద్ర ప్రభుత్వం భరోసా : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

నిరుద్యోగ యువతకు ఆధునీక యంత్రాలను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న నిరుద్యోగ యువతి,యువకులు అభివృద్ధి చెందేందుకు స్వయం ఉపాధి కింద శిక్షణ ఇచ్చి పనిముట్లను అందజేసి వారికి జీవితాల్లో కొత్త వెలుగులు నింపడానికి ఆత్మనిర్భర భారత్ ఎంతో కృషి చేస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో ఖాదీ, విలేజ్, ఇండస్ట్రీస్ కమిషన్ (కే.వి.ఐ.సి) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణ, ఆధునీకయంత్రాలు, టూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. చేతి వృత్తుల కళాకారులను గౌరవించేందుకు కుటీర పరిశ్రమలను అభివృద్ధిపర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో వ్యవసాయ అభివృద్ధితో పాటు కుటీర పరిశ్రమలు, ఖాదీ వస్త్రాలను అంతా వినియోగించుకునేలా మోదీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా 1800 మంది లబ్ధిదారులకు కుండలు,మట్టి వస్తువుల తయారీకి ఎలక్ట్రిక్ చక్రాలు, అగర్‌బత్తీనయంత్రాలు, కుట్టు యంత్రాలు, మొబైల్ రిపేరింగ్‌కిట్లు, పాదరక్షాల తయారీ వంటి కిట్లను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. గ్రామీణ పరిశ్రమలను బలోపేతం చేయడం ద్వారా స్వాలంబ భారత్ నిర్మాణంలో యువత ముందుకు సాగాలన్నారు. ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవి.ఐసి)ఛైర్మన్ మనోజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన యువతి,యువకులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారంలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో ఉంటుంది : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తార్నాక, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : స్థానిక సమస్యల పరిష్కారంలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి ఆయన తార్నాక డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా తార్నాక నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ సభ్యులు, బస్తీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక సమస్యలు, మౌలిక వసతులు, మున్సిపల్ సేవల మెరుగుదలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్ర రెడ్డి, ఓయూ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తిరుపతి, మల్లేశ్వరి, భారత్‌గౌడ్, బండ చంద్ర రెడ్డి, వీరన్న, బండ శివారెడ్డి తదితర నాయకులు, వివిధ విభాగాల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘంప్రతినిధులు పాల్గొన్నారు.

వశిష్టుడితో బ్రహ్మర్షి అనిపించుకున్న విశ్వామిత్రుడు : డా.కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : వేటకు వెళ్లిన విశ్వామిత్ర మహారాజు అక్కడ వశిష్ట మహర్షిని సందర్శించి ఆయన వద్దనుండే నందిని అనే కామధేనువు అనే గోవు మహత్తుని తెలుసుకుంటాడు. దాన్ని పొందడానికి వశిష్టుడు చెప్పిన గాయత్రి మంత్రానుష్టానం చేసి బ్రహ్మర్షి పదవిని తపస్సు చేసి పొందుతానని చేసిన శపథంలో విజయవంతమై వశిష్టుడిచేత బ్రహ్మర్షి అనిపించుకున్న వైనాన్ని కళ్లకుకట్టిన నాటకమే విశ్వామిత్రుడు విజయం అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి తెలిపారు. ప్రముఖ రసరంజని, హైదరాబాద్ ప్రతీనెలా ప్రదర్శిస్తున్న ఒక నాటకంలో భాగంగా రవీంద్రభారతి ప్రధానమందిరంలో హెచ్‌వీఎస్.ప్రసాద్‌బాబు, టి. నరసింహారావుల రచన; తాటికొండాల నరసింహారావు దర్శకత్వం, ఖమ్మం కల్చరల్ అసోసియేషన్, ఖమ్మం వారి సమర్పణలు విశ్వామిత్ర విజయం పద్యనాటకం అద్భుతం ప్రదర్శింపబడి ఆహుతుల ప్రశంసలందుకుంది. ప్రధాన పాత్రలో విశ్వామిత్రుడుగా హరినాథ్, వశిష్టుడుగా రోశయ్యచౌదరి, దేవేంద్రుడుగా చెన్నారావు, త్రిశంకుడుగా రవీందర్‌రావు, మంత్రిగా వీరభద్రం, రాజగురువుగా ప్రకాశరావు, అరుంధతిగా సురభి రమాలక్ష్మి, మేనకగా సురభి వెంగమాంబ, అశరీరవాణిగా సురభి హారికలు తమతమ పాత్రల్లో అద్భుతంగా రాణించి మెప్పించారు. ఎ.వెంకటేశ్వర్లు అద్భుత సంగీతాన్ని అందించి పద్యనాటకాన్ని మరింత రక్తికట్టించారు. చివరిగా కళాకారులను అతిథుల చేతులమీదుగా ఘనంగా సన్మానించారు. రసరంజని కార్యవర్గం ప్రదర్శనను పర్యవేక్షించింది.

విశ్వామిత్ర విజయం పద్యనాటకంలో దృశ్యం

దేశానికి బాబాలు పెద్ద ముప్పు : గౌహర్ ఆరోపణ

సైఫాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: సైన్స్ ఉద్యమం రాజకీయ నాయకులకు, బాబాలకు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించి దానిపైన పోరాటాలు చేయాలని ప్రముఖ శాస్త్రవేత, రచయిత, డాక్యుమెంటరీ ఫిలిం మేకర్ గౌహర్ రాజా సూచించారు. దేశానికి బాబాల నుంచి పెద్ద ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యకం చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం, జన విజ్ఞాన వేదిక ఇవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. బాబాల పేరమీద ఉన్న లక్షల కోట్ల రూపాయలు విలువ గలిగిన ఆస్తులను క్రమబద్ధీకరించేలా సైన్స్ ఉద్యమం ప్రభుత్వాలపై వత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అత్యధికంగా ప్రాధాన్యత ఇచ్చిన శాస్త్రీయ దృక్పథం 2014 తరువాత క్షిణదశకు చేరుకుందని, ప్రస్తుత ప్రధాని ఆఫా మాషిగా చేస్తున్నట్లు కనబడుతున్న ప్రతి ప్రకటన వెనుక కుట్రదాగిఉందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాయ కార్పోరేషన్ అధ్యక్షుడు డా.రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రగతిశీల వాదులంతా ఒకతాటిపైకి రావాలని, జన విజ్ఞాన వేదిక వీరందరిని కలుపుకు పోయే బాధ్యతను తీసుకోవాలని కోరారు. విజ్ఞాన వ్యాప్తిలో జన విజ్ఞాన వేదిక కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుసు_ందని ఆయన హామీ ఇచ్చారు. జెవివి రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ రామచంద్రయ్య, డా.పి.రజని, రాజా, రాజేశ్, చెలిమల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తార్నాక చౌరస్తాలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన

తార్నాక చౌరస్తాలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్స్ పెక్టర్ కె. సత్యనారాయణ

తార్నాక, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : నగర ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వాహనదారులు, ప్రయాణికులకు రహదారి భద్రత నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, కారులో ప్రయాణించే సమయంలో సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయరాదనే నియమాలపై పోలీసులు స్పష్టంగా వివరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఇన్స్ పెక్టర్ సూచించారు.

మూసాపేట పంచశీల స్కూల్లో జాతీయ విజ్ఞాన దినోత్సవం



పాఠశాలలో సుదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట పంచశీల స్కూల్‌లో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు, విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రము పొట్ల జిజ్ఞాస కలిగి ఉండాలన్నారు. సివి రామన్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార విక్రయ కేంద్రాలపై జిహెచ్ఎంసి తనిఖీ

పరిశుభ్రత లోపాలు..గడువు ముగిసిన పదార్థాల నిల్వ

రెండు హోటళ్లకు నోటీసులు జారీ చేసిన అధికారులు

హోటల్‌లో తనిఖీ చేస్తున్న సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ మంగతాయారు

హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ జోన్ పరిధిలో ఆహార విక్రయ కేంద్రాలపై జిహెచ్ఎంసీ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ మంగతాయారు, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్వాతి, సాహితీ, కవాడిగూడ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్, డిప్యూటీ ఎస్‌డబ్ల్యూఎం బృందాలు కలిసి కవాడిగూడ సర్కిల్‌లోని అమంత్రన్ హోటల్ అండ్ బ్యాంక్వెట్స్, సమోసా ఖార్ఖానా ప్రాంగణాలను తనిఖీ చేశారు. తనిఖీలలో పరిశుభ్రత లోపాలు, శానిటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల సక్రమ నిర్వహణ లేకపోవడం, గడువు ముగిసిన ఆహార పదార్థాల నిల్వ, అనధికారిక ఫుడ్ కలర్స్ వినియోగం వంటి ఉల్లంఘనలు జీహెచ్ఎంసీ అధికారులు తనిఖీలో గుర్తించారు. ఈ నేపథ్యంలో సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆహార భద్రతా చట్టం ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో హోటల్ లు, ఆహార విక్రయ కేంద్రాల్లో శుచి, శుభ్రత పాటించాలి. ఆహార భద్రత ప్రమాణాల నిక్కచ్చిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన, ఆహారం, తినుబండారాల్లో నాణ్యత లోపించిన, అపరిశుభ్రత వాతావరణం ఉన్న చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది.

మీ కష్ట సుఖాలలో అండగా ఉంటా : ఎమ్మెల్యే తలసాని

సిల్వర్ డ్రాప్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తలసాని.

బేగంపేట ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

మీ కష్ట సుఖాలలో మీకు అండగా ఉంటానని, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ టైలర్స్‌కు హామీ ఇచ్చారు. రాంగోపాల్‌పేట డివిజన్ లోని సిల్వర్ డ్రాప్ ఫంక్షన్ హాలులో ఉజ్జయినీ మహంకాళీ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టైలర్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా బట్టలు కుట్టే పని వృత్తిగా చేసుకుని మేరు కులస్థులు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు చేతి నిండా పనితో ఎంతో సంతోషంగా ఉండే వారని చెప్పారు. కానీ రెడీమేడ్ దుస్తుల రాకతో టైలరింగ్ వృత్తికి కొంత మేర నష్టం కలిగిస్తుందని విచారం వ్యక్తం చేసారు. కుల వృత్తులకు చేయూత ఇవ్వాలన్నారు. కుల వృత్తులపై ఆధార పడిన కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేసిందని వివరించారు. టైలర్లు ఐక్యంగా ఉండాలని మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తలసాని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణాగౌడ్, అసోసియేషన్ అధ్యక్షులు రాజయ్య, రవీందర్, ఉపాధ్యక్షుడు శ్యామ్, సభ్యులు కృష్ణ, కిషోర్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు హరికృష్ణ, కిషోర్ కుమార్, ఆంజనేయులు, సతీష్, అరుణ్‌భట్, గణేష్, పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి వార్షిక వేడుకలు

-పాల్గొన్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం 35వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్, బతుకమ్మకుంట, చర్చిబస్తీ వద్ద నిర్వహించిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం వార్షికోత్సవ వేడుకల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని గతంలో తన సొంత నిధులతో నిర్మించిన విషయాన్ని భక్తులు, బస్తీ ప్రజలు గుర్తుచేసుకుంటూ, ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేవాలయ నిర్మాణానికి ఆయన చేసిన సేవలను ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులు ఎమ్మెల్యే కాలేరును ఘనంగా సత్కరించి, స్వామివారి ఆశీర్వదం అందించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి, భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీ చంద్రమోహన్ గారు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఉచిత చికిత్సకు ఎన్‌వోసి అందజేసిన ఎమ్మెల్యే...

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి వైద్య ఖర్చుల కోసం సిఎంఆర్‌లీఫ్ ఫండ్ ద్వారా 2లక్షల ఎన్‌వోసి పత్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందజేశారు. శనివారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన అంబర్‌పేటకు చెందిన సయ్యద్ అయిషా కుటుంబ సభ్యులకు ఎన్‌వోసి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సహాయం అందించడంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. పేద రోగులు సిఎంఆర్‌లీఫ్ ఫండ్‌ను ఉపయోగించుకోవాలని కోరారు.

పన్నులు చెల్లించండి - నగరాభివృద్ధికి సహకరించండి

-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

గ్రేటర్ హైదరాబాద్ నగర పౌరుల ప్రాపర్టీ ట్యాక్స్ సంబంధిత సమస్యలకు వేగవంతమైన పరిష్కారం కల్పించేందుకు జీహెచ ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం కార్యక్రమాన్ని వచ్చే మార్చి నెలలో ప్రతి ఆదివారం నిర్వహించనుంది. మార్చి 1, 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు, వాల్యుయేషన్ అధికారులు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు హాజరై పన్ను సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరిస్తారు. రివిజన్ పిటిషన్లు, ట్యాక్స్ అంచనాల సవరణలు, బిల్ కలెక్టర్లు , ఆన్లైన్, ఆర్‌టీజీఎస్ ద్వారా చెల్లించిన మొత్తాల నమోదు, బకాయిల సవరణలు, కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్ఎస్ అంశాలు, స్వీయ అంచనా సమస్యలు తదితర పన్ను సంబంధిత అన్ని అంశాలను ఈ వేదికపై పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోనున్నారు. ప్రతి కేంద్రంలో కంప్యూటర్లు, ఆన్‌లైన్ సదుపాయం, ప్రింటర్‌లతో మూడు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. పౌరులకు మార్గదర్శనం చేసేందుకు రిసెప్షన్ కౌంటర్ కూడా ఏర్పాటు చేస్తారు. దరఖాస్తులు స్వీకరించిన వెంటనే సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కారం అందించనున్నారు. రివిజన్ పిటిషన్లను అత్యవసర ప్రాధాన్యంతో పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఆన్‌లైన్ సవరణలు గతంలో కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న పిటిషనర్లు కూడా నిబంధనల ప్రకారం పరిష్కారం కోసం హాజరుకావాలని జీహెచ్ఎంసీ కోరింది. ప్రతిరోజు నివేదికలు రెవెన్యూ విభాగానికి పంపడంతో పాటు గూగుల్ డ్రైవ్‌లో నవీకరించనున్నారు. నిర్దేశించిన తేదీల్లో కార్యక్రమం నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

పన్నులు చెల్లించండి - నగరాభివృద్ధికి సహకరించండి

: కమిషనర్ ఆర్‌వి కర్ణన్ పిలుపు

గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రజలు తమ ప్రాపర్టీ టాక్స్ చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. దీర్ఘకాలంగా ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారికి ఊరటనిస్తూ వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటిఎస్) పథకాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరంకు గానూ ప్రభుత్వం ప్రకటించిదన్నారు. ఈ స్కీమ్ కింద పాత బకాయిలపై పేరుకుపోయిన వడ్డీలో ఏకంగా 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వెంటనే పనులను చెల్లించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

భక్తిప్రపత్తులతో బార్కాస్ ద్విముఖ ఆంజనేయస్వామికి పూజలు

- దర్శించుకున్న ఎమ్మెల్యే రాజా సింగ్

- మతసామరస్యాన్ని చాటిన కుస్తీ పహిల్వాన్

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్ట బాలాపూర్ రోడ్డు హనుమాన్‌బండ శ్రీ ద్విముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చక స్వాములు ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనం, దేవాలయ సంప్రోక్షణ, మహా పంచామృతాభిషేకం, సింధూర లేపనం, ఆకుపూజ, మహా హారతి, మన్యుసూక్త శాంతి హోమం, పూర్ణాహుతిని భక్తిప్రపత్తులతో జరిపించారు. అనంతరం ఆంజనేయస్వామికి వడమాలను, మహా నైవేద్యం సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో గోషామహల్ శాసనసభ్యులు రాజా సింగ్, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆలె భాగ్యలక్ష్మి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, నేతలు చీకోటి ప్రవీణ్, కౌడి మహేందర్, జె.నవీన్ యాదవ్, ధరంకార్ నాగరాజ్, బస్తీవాసులు పొల్యాయి సాయికిరణ్, రవి రాహుల్, సాయి కుమార్, నితిన్, నవీన్, శివలాల్, మహేందర్, శ్రీధర్, రాజు, రాజేష్ తదితరులు పాల్గొని హనుమకు పూజలు చేసి దర్శించుకున్నారు. కుస్తీ పహిల్వాన్ ఈసా యాఫై ఆంజనేయస్వామిని పూజించి మతసామరస్యాన్ని చాటారు. తాను కుస్తీ పోటీలకు వెళ్ళే సమయంలో స్వామిని పూజించి వెళ్ళేవాడనని తెలిపారు. నిర్వాహకులు ఈసా యాఫై, ఇన్‌స్పెక్టర్ గోపిని శాలువతో సన్మానించారు. ఆ తరువాత నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కాగా ఈనెల 24వ తేదీన దుండగులు ఆలయం తాళాలు పగులగొట్టి గర్భగుడిలోని స్వామి వారి విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన నేపథ్యంలో ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించింది.

కుస్తీ పహిల్వాన్ ఈసా యాఫైని, ఇన్‌స్పెక్టర్ గోపిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఉద్యమి సభ్యత్వాల ద్వారా ప్రజలని జనసేన పార్టీలోకి ఆహ్వానిద్దాం

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

ఉద్యమి సభ్యత్వాల ద్వారా ప్రజలని జనసేన పార్టీలోకి ఆహ్వానించి, తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని జనసేన పార్టీ ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కెపిహెచ్‌బి కాలనీ 5వ ఫేస్ తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో మహబూబ్ నగర్ పార్లమెంట్, సైబరాబాద్ కార్పొరేషన్ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్, అడక్ కమిటీ సభ్యులు నందగిరి సతీష్, యాదమ రాజేశ్, బొర్రా వెంకట అప్పారావు సైబరాబాద్ కార్పొరేషన్‌లోని జనసేన పార్టీ సదక్ కులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ సాదకులు పవన్ కళ్యాణ్ ఆశయలను, జనసేన పార్టీ సిదంతలను ప్రజలోకి తీసుకువెళ్ళి క్రియాశీలక ఉద్యమి సభ్యత్వాలు ప్రతి ఒక్కరితో చేయించాలని, ముఖ్యంగా పేద కుటుంబాలతో ఈ యొక్క సభ్యత్వము కచ్చితంగా చేయించాలని, పార్టీ నుంచి వచ్చే ఇ న్సూరెన్స్ భవిష్యత్తులో వారికి ఏవిధంగా ఉపయోగపడుతుందో తెలియచేసి వారిని పార్టీ లోకి ఆహ్వానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కార్పొరేషన్‌లోని నియోజకవర్గ నాయకులు, జనసేన పార్టీ సాదక్‌లు జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

ఖైరతాబాద్ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఖైరతాబాద్‌లోని వాసవి సేవా కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వ సుజాత, టిపిసిసి కార్యదర్శి విజయారెడ్డి పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా మోడీ నరేష్ కుమార్ గుప్తా, కార్యదర్శిగా మిరియాల చంద్రప్రకాష్ గుప్తా, కోశాధికారిగా మల్లికార్జున రమేష్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా అరుణాత్రి మహేష్ గుప్తా, ఉప కార్యదర్శిగా గోపిశెట్టి ప్రవీణ్ గుప్తా, ఉప కోశాధికారిగా కస్తూరి శ్రీనివాస్ గుప్తా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కొండ్లె మల్లికార్జున్ గుప్తాతో పాటు ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి అశోక వన్ మాల్‌లో కెఎఫ్‌సిలో కుళ్ళిన చికెన్...

-వినియోగదారుడు వార్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని మెట్రో సమీపంలో గల అశోక వన్ మాల్‌లో ఉన్న కేఎఫ్సీ అవుట్ లెట్‌లో కుళ్లిపోయిన చికెన్ వడ్డించారని వినియోగదారుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అశోక 1 మాల్‌కు వచ్చిన అందరు కస్టమర్లు కేఎఫ్సి అవుట్లెట్లో చికెన్ ఆర్డర్ చేశారు. వినియోగదారులకు అందజేసిన చికెన్ మాంసం నుండి దుర్వాసన రావడంతో అది కుళ్లిపోయిందని గ్రహించిన వారు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఎదావిధిగా తీసుకొని కుళ్ళిపోయిన చికెన్ అందజేయడం వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్

లేఖ నం. 08/CMC/MPR-50/EE/2025-26, తేది: 27.02.2026. నిట్ నం: షైన్ పేర్కొన్నది. పని పేరు: అభివృద్ధి పనులు, అంచనా మొత్తం: 65.00 లక్షలు. బిడ్స్ స్వీకరణలకు ప్రారంభ తేదీ/చివరి తేదీ & సమయం: 02.03.2026 మ.02.00 గం. 06.03.2026 మ.02.30 గం. అధికారి పేరు & చిరునామా: శ్రీ డి. గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, సెల్: 9154299633. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చు. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాదాపూర్ సర్కిల్-50, CMC,
DIPR.No.16209-PP/CL/Advt/1/2025-26, తేది: 28.02.2026

IN THE COURT OF THE [illegible] ADDITIONAL [illegible] MEDCHAL MALKAJGIRI DISTRICT AT MEDCHAL
[illegible]

IN THE COURT OFTHE HON'BLE CHIEF JUDGE: CITY CIVIL COURTS AT HYDERABAD
OS.No. 71 of 2026
Between
Mrs Tatikola Kanakalakshmi & others ...Plaintiffs
AND
1. The Tahsildar, 10-3-470, Asifnagar Road, Vijayanagar Colony, Hyderabad500057
2. All concerned ...Defendants
To
All concerned
It is to inform thFe public at large that 1, Mrs. Tatikola Kanakalakshmi, 2. Mrs. T.V.R. Madhavi, 3. Tatikola Sonanya, 4.Tatikola Patanjali, 5. T. Pavani and 6. T. Chaitanya Pratik, all the parties together filed the above suit for declaration against the Tashildar, Asifnagar and all concerned to declare the parties No.1,3 and 4 as legal heirs of Tatikola Seshu and parties No.2, 5 & 6 as legal heirs of Tatikola Timmarusu and all the parties No.1 to 6 to declare them as legal heirs and successors in interest to succeed the suit schedule property owned and possessed by T.V.R.K. Subba Rao. The description of suit schedule property is as under.
SUIT SCHEDULE PROPERTY
House bearing M.C.H.No. No.12-2-709/33 and 12-2-709/33/1 having ground and first floor comprising 3,500 sq.ft each with appurtenant land of 462.56 sq. yards situated at Navodaya Colony, Mehdipatnam, Hyderabad -500028 and bounded. North: Plot No.32 & piece of land adm.44.44 Sq yards sold to Smt. Y. Ramalaxmi. South: PlotNo.34. East: 40 feet road. West: Plot No.24.The above suit is posted on 18-03-2026 before the Hon'ble Chief Judge, City Civil Court, Hyderabad for appearance of the Defendants to answer the claim and relief sought by the Plaintiffs. If any person or persons having any objections or claims they may appear on 18.03.2026 at 10.30 A.M before the above said court, either in person or through an advocate failing which the matter will be decided basing the documents available on record.
G. Sanjeeva Reddy, M Ranjith Kumar
Advocates,
#3-6-525, St.No.7, Himayatnagar, Hyderabad-29
Cell: 98492 75949
Counsel for the Plaintiffs

మేరు కులస్తులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి: సురేష్

టైలర్స్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఓల్డ్ మలక్ పేట్ లో కేక్ కట్ చేస్తున్న టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లే సురేష్, బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, బాబు సుదర్శన్ తదితరులు.

మలక్ పేట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: మేరు కులస్తులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లే సురేష్ పేర్కొన్నారు. టైలర్స్ డే ని పురస్కరించుకుని ఓల్డ్ మలక్ పేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరు కులస్తులు రాజకీయాలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, నాయకులు బాబు సుదర్శన్, అరున్ కుమార్, కనుకుల ప్రేమ్, కోండ శ్యాం, అమర్ నాథ్ గౌడ్, బాబా గౌడ్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

: ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ, మలక్ పేట ఎమ్మెల్యే బలాల, చిత్రంలో నాయకులు సాలం షాహిద్ మినాజుద్దిన్, షఫీ తదితరులు

మలక్ పేట ఫిబ్రవరి 28, ప్రభాతవార్త : ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ, మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అక్బర్ బాగ్ లో సీనియర్ నాయకులు ఖాషిఫ్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇఫ్తార్ విందులు ఐక్యతను, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాలం షాహిద్, మినాజుద్దీన్, నాయకులు అబ్రార్ సైఫుద్ధిన్ షఫీ, ఇఫ్తేకార్ తదితరులు పాల్గొన్నారు.

రాఫా పబ్లిక్ స్కూల్లో ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్

తుర్కయంజాల్ ఫిబ్రవరి28,ప్రభాతవార్త : ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ ఉమ్మర్ఖాన్ గూడ లోని రాఫా పబ్లిక్ స్కూల్లో శనివారం ఏర్పాటు చేసినటువంటి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కదారి శ్రీలత అనిల్ కుమార్ పాల్గొని సైన్సు ఎగ్జిబిషన్ ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ చిన్న చిన్న పిల్లలు సహితం, వారి స్వయంకృషితో పర్యావరణానికి మరియు మన దైయనందినక జీవితంలో అవసరమైన రక రకాల ఏకూప్మెంట్స్ ని తయారుచేసి స్కూల్ లో, ప్రదర్శించడం జరిగింది. కలుషితమైపోతున్న నీటిని, వాతావరణాన్ని మరియు ప్రకృతిని మనం ఏ విధంగా కాపాడుకోవాలో గ్రామస్తులకు మరియు వచ్చిన తల్లిదండ్రులకు, విద్యార్థులు చక్కగా వివరించడం జరిగింది. చిన్నప్పటినుండే, పిల్లలకు మంచి విద్యాబుద్ధులు అందించడంతోపాటు, వారిలో ఉన్న సృజనాత్మకతను బయటకు తీసి, ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న రాఫా పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని, ఎంతో కొనియాడారు. ఈ సందర్భంగా, రాఫా స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్ ఎస్తేరు రాణి మాట్లాడుతూ, విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, రానున్న రోజులలో ఇలాంటి గొప్ప గొప్ప కార్యక్రమాలు ఇంకా ఎన్నో నిర్వహిస్తామని అందుకు తల్లిదండ్రులు సహకరించాలని మరొకసారి గుర్తు చేశారు. రాఫా పబ్లిక్ స్కూల్ చైర్మన్ సిహెచ్ వెంకటేశం మాట్లాడుతూ, ఈ విధంగా పిల్లల్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్ లో, గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు మరియు టీచర్స్

రేణుక ఎల్లమ్మ కళ్యాణంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి ఫిబ్రవరి28,ప్రభాతవార్త : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఇందిరా నెహ్రూనగర్ లో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కళ్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్ర నెహ్రూ నగర్ లో గత ఐదు రోజుల నుండి శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కళ్యాణ మహోత్సవంలో మాజీ మైనంపల్లి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ కాలనీ ప్రజలందరూ కలిసి ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. ఆలయానికి అన్ని రకాలుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముత్యాలు మురళి కృష్ణ ఇస్తారు రామకృష్ణ అమర్నాథ్ రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు జి ఎన్ వి సతీష్ కుమార్ మాజీ కౌన్సిలర్ వెంకటేష్ సంతోష్ రాందాస్ నాగరాజ్ తదితరు పాల్గొన్నారు .

టిజిఓ జిల్లా అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

తుర్కయంజాల్ ఫిబ్రవరి28, ప్రభాతవార్త రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం చైర్ పర్సన్ రేవతి ఆధ్వర్యంలో టిజిఓఎస్ భవన్ లో రంగారెడ్డి జిల్లా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉత్సవాల పోస్టర్ ను టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ రామారావు,కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, మహిళా విభాగం రాష్ట్ర కోశాధికారి శాంతి శిరీష, శ్రీ నరహరి, శ్రీ షౌకత్ తదితరులు పాల్గొన్నారు

భక్తి మార్గంతోనే ప్రశాంతత : చిన్నజీయర్‌స్వామి

భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న చిన్నజీయర్‌స్వామి

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: భగవంతుని నామస్మరణ చేస్తూ భక్తి మార్గంతో ఉన్నప్పుడే ప్రశాంతత లభిస్తుందని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ సౌభాగ్య పురంకాలనీలోని శ్రీపద్మావతి సమేత గోదా వెంకటేశ్వర స్వామివారి దేవాలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న సౌభాగ్యపుర శ్రీనివాసుని దశావతారం, విమాన వెంకటేశ్వరస్వామి, రాజగోపుర ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి పాల్గొన్నారు. చిన్నజీయర్‌స్వామితో పాటు త్రిదండి అహోబల రామానుజ జీయర్‌స్వామి పాల్గొని వారి దివ్య హస్తాలతో కుంభప్రోక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి వారు అనుగ్రహభాషణం చేశారు. గత మూడు రోజులుగా దేవాలయంలో గోత్రనామాలతో హోమం కార్యక్రమాన్ని వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నాప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, జగిని రమేష్‌గుప్తా, దేవాలయం కమిటీ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, మూర్తి, నరసింహారెడ్డి, శ్రీధర్, శ్రీకాంత్, రామారావు, ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

అహారభద్రత చట్టం పకడ్బంధీగా అమలు చేయాలి : అహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

చౌకధర దుకాణాన్ని పరిశీలిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితదరులు

హుడా కాంప్లెక్స్, 28 ఫిబ్రవరి, ప్రభాతవార్త : అహారభద్రత చట్టం పకడ్బంధీగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యామైన పౌష్టికాహారం అందిచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అహార కమిషన్ ఛౌర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్, హయత్ నగర్ మండలాలలో క్షేత్ర పర్యటన నిర్వహించారు.ఇందులో భాగంగా చౌకధర దుకాణాలను, అంగన్వాడీ కూంద్రాన్ని , విక్టోరియా మెమొరిల్ రెసిడెన్షియల్ పాఠశాల, వనస్థలిపురం ఏరియా అసుపత్రిలను కమిషన్ సభ్యులు శారద, భారతి, జ్యోతిలతో కలిసి అయన సందర్శించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ జాతీయ అహార భద్రత చట్టం 2013 పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రణాళికా బద్దంగా మెమోను రుపొందించిందని, దానికి అనుగుణంగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరకు చేరేలా చూడాల్సిన భాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. లబిదారులకు చట్టబద్ధమైన హక్కులు అము లచతదేయాలని సూచించారు. ప్రజల , విద్యార్ధుల సమస్యలను తెలిపేందురు పాఠశాల, ఛౌకధర దుకాణాల అవరణలో అధికారుల ఫోన్ నెంబర్ల తో కూడిన పిర్యాదు పట్టికను అమర్చాలని అధికారులకు ఛైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో అర్డీవోలు అనంత్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, డిఇఒ సుసిందర్ రావు, డీఎంహెచ్ఒ లలితాదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాల, జిల్లా మేనేజర్ హరీష్, సంక్షేమ శాఖ అధికారులు రామారావు, రమేశ్వరి, సంబంధిత అధికారులు పాల్గోన్నారు.

శ్రీ సాయిరామ, ఆర్టీసీ కాలనీ విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం : తుంగతుర్తి రవి

విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి , మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, శ్రీ సాయి రామ, ఆర్టీసి కాలనీ వాసులు

మేడిపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త ; మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ పీర్జాదిగూడ, శ్రీ సాయి రామ , ఆర్. టి.సి కాలనీలో దీర్ఘకాలంగా నెలకొన్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. కాలనీవాసులు , నాయకుల విజ్ఞప్తి మేరకు విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి పాల్గొని ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ... గతంలో తక్కువ ఎత్తులో ఉండటం వల్ల ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో, ఇప్పుడు అత్యాధునిక "కాంటిలివర్ స్తమ్ పోల్ పద్ధతిలో ఎత్తులో కొత్త సెటప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే దీనివల్ల విద్యుత్ సరఫరా 3ఫేస్ కు కన్వర్ట్ చేసారని , కాలనీలో లోవోల్టేజ్ సమస్యలు ఇకపై ఉండవని పేర్కొన్నారు.3 ఫేస్ లైన్ కాలనీ లోని వినాయకుడి మండపం వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్ల వల్ల తరచూ అంతరాయం కలుగుతోందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన తుంగతుర్తి రవి,వెంటనే స్పందించి 3.ఫేస్ లైన్ అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను సరిచేసిన విద్యుత్ శాఖ అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, విద్యుత్ శాఖ అధికారులు డీఈ లింగయ్య,ఏడీ విజయ్ కుమార్ రెడ్డి, ఏఈ సత్యానారాయణ రెడ్డి, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ రావు, లైన్ మెన్ భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, జేఎల్ఎం వెంకటేష్, కాంట్రాక్టర్లు రవి, నరేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు ప్రతీక్ ప్రేమ్ రాజ్, రమేష్, శ్రీకాంత్, కాశీనాథ్, ప్రసాద్, మల్లయ్య,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీ సత్యదేవుని ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం దృశ్యం.

రామంతాపూర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : రామంతాపూర్ లోని ప్రసిద్ధి శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంగరంగ వైభవంగా ముస్తాబు అయ్యింది. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో మార్చి 1 నుంచి 6వ తేది వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ పౌండర్ ట్రస్టీ కోట్ల నరసింహారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఇ.ఎన్.విజయ కుమారి తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రతి రోజు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నామని, వేద ప్రభంద పారాయణం, సేవా కాలం, తోళక్యం, ప్రదోత్సవం, అధ్యాపకులకు సన్మానం చేసినట్లు తెలిపారు. మార్చి 1వ తేదిన విశ్వకేన ఆరాధన అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ట, హావనం, ఆరగింపు, హనుమాద్ వాహన సేవ ఉంటుందని తెలిపారు. 2వ తేదిన ఉదయం సేవా కాలం, ఆరగింపు, మహాకుంభ స్థాపన, ధ్వజారోహణ, గరుడ ముద్ద, నైనతేయ ఇష్ట సంతానం, కాల సర్పదోష నివారణ, బేరి పూజ, దేవ తాహ్వానం, హోమం, బలిహరణం, ఆరగింపు, ఎదుర్కోళ్లు, నాధస్వర కచేరి, హంస వాహన సేవ, అశ్వ వాహన సేవ ఉంటుందని తెలిపారు. 3వ తేదిన చంద్ర గ్రహణం కారణంగా ఆలయం మూసివేస్తామని తెలిపారు. 4వ తేదిన ఉదయం సేవా కాలం, హోమం, బలిహరణం, శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి తిరుక్కళ్యాణోత్సవం, అనంతరం అన్నప్రసాద వితరణ, హోమం, బలిహరణం తీర్థ ప్రసాద గోష్టి. గరుడ వాహన సేవ ఉంటుందని తెలిపారు. 5వ తేదిన సేవా కాలం, ఆరగింపు, ప్రసాద వినియోగం, హోమం, శ్రీ సుదర్శన నారసింహ ఇష్టి, ఆరోగ్యం, ఐశ్వర్యం, శ్రీ వారి గజవాహన రథోత్సవం ఉంటుందని తెలిపారు. 6వ తేదిన హోమం, మహాపూర్ణాహుతి, అష్టోత్తర శతకళశాభిషేకం,చక్ర తీర్థం, ఆరగింపు, చంద్ర ప్రభ వాహన సేవ ఉంటుందని తెలిపారు. బీట్కూరి విజయసారధి, యాజ్ఞీకుల శ్రీ మంగళ తిరుపతాచార్యులు, మంగళగిరి శ్రీనివాసాచార్యులు, దివి శేష చార్యులు, సీతారామచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పలువురు పార్టీల నేతలు పాల్గొంటారని తెలిపారు.

10వ తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్ష సామగ్రి పంపిణీ

పదవతరగతి విద్యార్థులకు పరీక్ష మెటిరీయల్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

నాచారం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : త్వరలో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రోత్సాహం కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో నాచారం డివిజన్‌లోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తూ సహకరిస్తున్న సాయిజెన్ శేఖర్‌ను అభినందించారు.అలాగే, భవిష్యత్తులో విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌లో ర్యాంక్ సాధిస్తే ఐదు సంవత్సరాల పాటు పూర్తి ఫీజులు భరిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఇప్పటికే సుమారు 200 మందికి పైగా విద్యార్థుల విద్యా ఫీజులను భరిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో ఆర్టీసీ బస్సు సర్వీసులు : శ్రీవాణి

రామంతాపూర్‌లో ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

రామంతాపూర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్ ప్రజలకు రవాణా సదుపాయం కల్పించేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి తెలిపారు. ఈ మేరకు శనివారం రామంతాపూర్‌లో 115డి బస్సు సర్వీసును ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే దిశగా మరో ముఖ్యమైన అడుగు వేసినట్లు తెలిపారు. కాచిగూడ డిపో నుంచి 115 బస్సు కోఠి నుండి రామంతపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్స్ వరకు, రామంతపూర్ బోడ్రాయి మార్గంగా నడవనుందని తెలిపారు. ఈ రూటులో ప్రతిరోజూ 10 ట్రిప్పులు నిర్వహించబడతాయని ఆమె తెలిపారు. ఈ సేవల ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు మరియు వృద్ధులకు ప్రయాణ సౌకర్యం మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ప్రజల విజ్ఞప్తిని వెంటనే స్పందించిన కాచిగూడ డిపో మేనేజర్ సి.హెచ్. వెంకటేశ్వరరావు, డిపో మేనేజర్ పావనిలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బుర్ర రాజేశ్వర్, వేముల తిరుపతయ్య, తమ్మలి రవి, వీణ, ముస్తాక్, సురేష్, మురళి, సత్యనారాయణ, గుండె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు టైర్లలకు అందేలా చూడాలి

- టైలర్ల సంక్షేమ సంఘం నాయకులు.

టైలర్స్ డే వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం.

కుషాయిగూడ,ఫిబ్రవరి 28, ప్రభతవార్త ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు టైలర్లకు అందే విధంగా కృషి చేయాలని టైలర్స్ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. టైలర్స్ డే ను పురస్కరించుకుని కాప్రా సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు ఉప్పల్ నియోజకవర్గ మేరు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎస్ బి కాలనీలో డైమండ్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ప్రభుత్వం అందజేసే కుట్టు మిషన్లను మేల్ కులస్తులకు అందజేయాలని స్కూల్ యూనిఫార్మ్స్ ఆర్డర్లు కూడా మీరు కులస్తులకే ఇవ్వాలని ఉప్పల్ నీరు సంఘం అధ్యక్షుడు సింగు విష్ణు కోరారు. ఈ కార్యక్రమంలో మెరిసింది నాయకులు కే శ్రీనివాస్ రుద్రంగి కరుణాకర్ రాపర్తి సాయి నాథ్ కర్నే మల్లేష్ మాడిశెట్టి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికే వరదనీటి కాలువ నిర్మాణం : మాజీ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: ఎల్‌బినగర్ రింగు రోడ్డు నుండి సరూర్‌నగర్ చెరువు కట్ట వరకు దాదాపు రూ.6 కోట్ల వ్యయంతో చేపడుతున్న వరదనీటి కాలువ గురించి బిజెపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం వివిధ కాలనీవాసులతో కలిసి వరదనీటి కాలువ నిర్మాణం జరిగే ప్రాంతంలో పర్యటించిన అనంతరం సిఎం రోడ్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక అపార్ట్‌మెంటు కోసం వరదనీటి కాలువ నిర్మాణం చేపడుతున్నారంటూ ప్రజల్లో బిజెపి నాయకులు అపోహలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, అయితే ఇది పూర్తిగా అవాస్తమని అన్నారు. డివిజన్‌లోని అనేక కాలనీల వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికే ఈ వరద నీటి కాలువ నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శాతవాహనగర్, కాకతీయ కాలనీ, మైత్రినగర్, దానాపురం, సౌభాగ్యనగర్, అధికారినగర్ తదితర కాలనీల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరం : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సిఐ కాలనీలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహిస్తున్న వివిధ పరీక్షల గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తగిన వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కాన్సర్‌ను ప్రారంభదశలోనే గుర్తించే అవకాశముంటుందన్నారు. ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, బిఎన్‌రెడ్డి డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సైన్స్ మన జీవితంలో భాగం


బహుమతులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: సైన్సు మన నిత్యజీవితంలో ఎంతో ఉపయోగపడుతుం దని, అది మన జీవితంలో ఒక భాగం అని భాష్యం పాఠశాల చైర్మన్ రామకృష్ణ పేర్కొన్నారు. ఆర్కేపురం భాష్యం పాఠశాలలో శనివారం నేషనల్ సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల సీఈఓ చైతన్య, జెడ్ ఈవో అంకమ్మరావు, పాఠశాల ప్రిన్సిపాల్ అప్పారావు, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ ప్రీతసునీల్‌లు మాట్లాడుతూ సైన్స్ లేకపోతే జీవితమే లేదన్నారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సివి రామన్ మనకు అందించిన అనేక విషయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సైన్స్ వల్ల కలిగే అనేగా ప్రయోజనాలు, సైన్స్ ప్రాధాన్యత గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన జాతీయ టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారు బహుమతులను అందజేశారు.

భరత్ నగర్ బస్తీ బాటలో సమస్యలు తెలుసుకున్న అనిల్ కుమార్

స్థానికులతో సమస్యలను తెలుసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్

నాచారం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా చర్లపల్లి డివిజన్ నుండి ఉమ్మడి మల్లాపూర్ శక్తిసాయి నగర్ డివిజన్‌లో విలీనం అయిన భరత్ నగర్ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. కాలనీ ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని భరోసా కల్పించారు.కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, దోమల సమస్య, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక వసతులపై స్థానికులు వివరించిన సమస్యలను ఆయన శ్రద్ధగా విన్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో భరత్ నగర్ కాలనీలో ఉన్న అన్ని ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అలీం, అన్వర్, కలీం, సోహైల్, జునైద్, అఫ్సాన్, అనస్, నజీర్, షేవార్, మొయిజ్, నజీం, ఖాదర్, రహీం, షేరు, సాజిద్, వసీం, అయూబ్, అబ్దుల్, మలేష్ రెడ్డి, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర సేవాదళ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సద్గుణ, మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తాంద్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, వుండం శ్రీనివాస్, లక్ష్మీపతి, సురేష్ గౌడ్, కంపెల్లి శివ, అన్వర్, ఎంఎస్ యూఐ అధ్యక్షుడు బాతరాజు రాహుల్, సాయి, సురేష్, రఘు, కృష్ణ, రాకేష్, అఖిలేష్ తదితరులు హాజరయ్యారు. భరత్ నగర్ కాలనీ అభివృద్ధికి సమగ్ర చర్యలు తీసుకుంటామని నాయకులు స్పష్టం చేశారు.

విద్యార్థులకు అన్ని రంగాల్లో రాణించాలి : రజితరెడ్డి

ఉప్పల్‌లో శ్రీ అక్షర స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల అసక్తి పెంచుకోవాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్‌లోని శ్రీ అక్షర స్కూల్ ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గురించి వారిని ఉన్నత సాయికి తీసుకెళ్లాలని, అందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎంతో కీలకమని ప్రశంసించారు, విద్యార్థులు పుస్తకాలు చదివిన విజ్ఞానాన్ని ప్రాజెక్టు రూపంలో చూపడం అభినందనీయమన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ఆలోచన శక్తి పరిశీలన సామర్థం, సృజనాత్మకత స్పష్టంగా కనిపించిందని అన్నారు. దేశ భవిష్యత్తుకు మంచి సాకేతాలు ఇస్తాయని ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అక్షర హైస్కూల్ ప్రిన్సిపాల్ రాజు, విజయేందర్ రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.